http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 9 ఆగస్టు 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad



## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828


### కేసీఆర్ నాయకత్వంలో

# మరో తెలంగాణ ఉద్యమం చేస్తాం

- కాంగ్రెస్ నేతలు చేస్తామన్న వరుణయాగాలపై స్పందించిన కేటీఆర్
- దైవకృపకు మానవ ప్రయత్నం కూడా ఉండాలి
- హిల్ట్ పాలసీలో డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు
- మీడియాతో కేటీఆర్ ఇష్టాగోష్ఠి
- 'కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేయలేదు'


హైదరాబాద్

హైదరాబాద్‌లో ఇండస్ట్రియల్ ఏరియాల్లోని భూములను మల్టీ పర్పస్ జోన్లుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీ మీద సెప్టెంబర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. 10 వేల ఎకరాల భూమిని ఎవరికో ధారాధత్తం చేసే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ విధానంపై - మిగతా3లో



## 'వికసిత్ భారత్' సాకారంలో యువతదే కీలక పాత్ర

- సవాళ్లే అవకాశాలుగా మారుతాయి
- నేర్చుకునే వాడు గెలుస్తాడు
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ
- ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిష్టాత్మక పురస్కారాల ప్రదానం
- స్వావలంబన అనేది వికసిత్ భారత్ అభివృద్ధికి పునాది





## చైనా మ్యాప్ వార్‌కు భారత్ గట్టి కౌంటర్

- అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు
- అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు ఖరారు
- సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో పేర్లను చేర్చిన కేంద్ర ప్రభుత్వం

## తెలంగాణ ప్రజలకు

# ట్రిపుల్ బొనాంజా

- ప్రభుత్వం నుంచి మూడు శుభవార్తలు
- ఆగస్ట్ 15న ఒకేసారి మూడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది
- ఈ మేరకు సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు
- ఇప్పటికే ప్రభుత్వం కార్యక్రమాల ప్రారంభానికి అన్నీ సిద్ధం చేసింది
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వీటిని ప్రారంభించనున్నారు




హైదరాబాద్

తెలంగాణలోని ప్రజలకు గుడ్ న్యూస్. రేవంత్ సర్కార్ ఆగస్ట్ 15న ట్రిపుల్ బొనాంజా అందించనుంది. ఒకేసారి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే మూడు కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పింఛన్ల పంపిణీతో పాటు గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ చట్టాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఈ మూడు కీలక కార్యక్రమాలను ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభించనుంది. వీటి వల్ల రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజలు లబ్ది పొందనున్నారు. సీఎం రేవంత్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. వీటి వివరాలు ఇప్పుడు చూద్దాం. తెలంగాణలోని రేషన్‌కార్డుదారులందరికీ కొత్త స్మార్ట్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. హైదరాబాద్‌లో - మిగతా3లో

## దేశ స్వాతంత్ర్యం కోసం బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేసిందేం లేదు



- నీతులు మాత్రమే చెబుతుంటారు
- స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించింది
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శ
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేదు
- రాహుల్ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని ప్రశంస

## సాగునీటి నిర్వహణ

# డిజిటలైజేషన్

- దిశగా ప్రభుత్వం అడుగులు
- 'స్టేట్ వాటర్ ఇన్ఫర్మేటిక్ సెంటర్' ఏర్పాటుకు నిర్ణయం
- వరదలు, కరవు పరిస్థితులను ముందుగానే అంచనా
- ఒకే వేదికపైకి ప్రాజెక్టుల నిర్వహణ, చెరువుల పర్యవేక్షణ
- సాగునీటి పంపిణీ, జలాశయాల నిర్వహణ, వరద నియంత్రణ
- ప్రవాహం రియల్ టైమ్‌లో పర్యవేక్షణ



హైదరాబాద్

సాగునీటి రంగాన్ని పూర్తిగా డేటా, సాంకేతిక ఆధారిత వ్యవస్థగా మార్చి జలవనరుల నిర్వహణ మరింత సులభం చేసేందుకు నీటిపారుదలశాఖ సన్నద్ధమవుతోంది. వరదల నుంచి కరవు వరకు చెరువులు మొదలు భారీ ఎత్తిపోతల పథకాల వరకు నీటినిర్వహణలో సమర్థత పెంచేలా డిజిటల్ విధానం రూపొందించనుంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డబ్ల్యూ-అమృతం పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో దిల్లీలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రతిపాదనలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సాగునీటి నిర్వహణను పూర్తిగా డిజిటలైజేషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం - మిగతా3లో



## సరిహద్దులకు 1 కి.మీ పరిధిలో విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయొద్దు

- కేంద్రం కొత్త మార్గదర్శకాలు జారీ
- ఎల్‌ఓసీ, ఎల్ఏసీ, అంతర్జాతీయ సరిహద్దులకు 1 కి.మీ. వరకు కొత్త ప్రాజెక్టులకు అనుమతి లేదు
- 50 కి.మీ. పరిధిని సున్నిత ప్రాంతంగా ప్రకటించిన కేంద్రం
- 50 కి.మీ.లోపు ప్రాజెక్టులకు హోంశాఖ అనుమతి తప్పనిసరి!

## ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో

# వసూళ్ల దందా!

- ఇదేంటని అడిగితే అడ్మిషన్ కావాలా వద్దా అంటూ ప్రశ్నలు
- ఎన్‌బీఏ పేరుతో రూ.22 వేల వసూలు
- ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల దోపిడీ
- అక్రిడిటేషన్ గుర్తింపు లభిస్తే కొత్త కోర్సులకు నాణ్యమైన ముద్ర పడినట్లే
- ఖర్చులుంటాయిగా అంటూ అధికారుల సమాధానాలు



హైదరాబాద్

ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరుతున్న విద్యార్థుల నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ పేరుతో కొన్ని ప్రైవేటు కాలేజీలు రూ.22 వేలు చొప్పున వసూలు చేస్తున్నాయి. మంచి బ్రాంచిల్లో సీటొచ్చింది కదా! సర్లే ఇచ్చేద్దాం అనుకుని విద్యార్థుల తల్లిదండ్రులు అదనంగా చెల్లిస్తున్నారు. మేడ్చల్‌కు సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల రూ.60 లక్షల అదనంగా వసూలు చేసుకుంది. ఈ వసూళ్లపై జేఎన్‌టీయూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు లభిస్తే కొత్త కోర్సులకు నాణ్యమైన ముద్ర పడినట్లే. ఫీజులు పెంచుకునేందుకు కూడా - మిగతా3లో




## మహిళా రిజర్వేషన్లకు షరతులెందుకు?

- రాహుల్, రిజిజు మధ్య మాటల యుద్ధం
- మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై కేంద్రాన్ని ప్రశ్నించిన రాహుల్ గాంధీ
- డీలిమిటేషన్ ప్రక్రియతో రిజర్వేషన్లను ఎందుకు ముడిపెడుతున్నారని ప్రశ్న

# ‘వికసిత్ భారత్’ సాకారంలో యువతదే కీలక పాత్ర

ప్రపంచం, సాంకేతికత వేగంగా మారుతున్నాయని, ఎవరైతే నిరంతరం నేర్చుకుంటారో వారే విజయం సాధిస్తారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. యువత నిత్య విద్యార్థుల్లాగా ఉంటూ, ఏదో ఒకటి తెలుసుకోవాలనే ఉత్సుకతను ఎల్లప్పుడూ సజీవంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం ఉన్నవారికి, అవే అవకాశాలుగా మారుతాయని పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తోందని, యువత కోసం కొత్త రంగాలు ఉద్భవిస్తున్నాయని చెప్పారు. దిల్లీ ఐఐటీ 57వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. ఐఐటీ దిల్లీలో ప్రారంభించిన కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమాలకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఒకప్పుడు సెమీకండక్టర్ల రంగంలో భారత్ సత్తాను కొందరు శంకించారని, అయితే ఇప్పుడు తొలి సెమీకండక్టర్ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభమైందని గుర్తుచేశారు. “ఈరోజు ప్రపంచం అత్యంత వేగంగా మారుతున్న తరుణంలో మీరు ఈ ఇన్‌స్టిట్యూట్ నుంచి బయటకు అడుగుపెడుతున్నారు. నేడు ప్రపంచ వ్యూహాత్మక సమీకరణాలు చాలా వేగంగా మారుతున్నాయి. గ్లోబల్ పవర్ బ్యాలెన్స్ కూడా అనుక్షణం మారుతోంది. దీని వెనుక ఉన్న అతిపెద్ద శక్తి టెక్నాలజీ వేగం. రానున్న 20 నుంచి 30 ఏళ్లలో ప్రపంచం ఎలా ఉంటుందని ఈరోజు ఎవరూ కచ్చితంగా చెప్పలేరు. కానీ , మార్పుల పర్వం వచ్చినప్పుడల్లా సవాళ్లు కూడా వస్తుంటాయి. అలాగే కొత్త అవకాశాలు కూడా పుట్టుకొస్తాయి. ప్రపంచం మారుతుంది, టెక్నాలజీ మారుతుంది, పరిశ్రమలు మారుతాయి, వృత్తులు కూడా మారుతాయి. కానీ వీటన్నింటి మధ్య నా మాట ఒకటి గుర్తుంచుకోండి. ఎవరైతే నిత్య విద్యార్థిగా ఉంటారో వారే గెలుస్తారు. జీవితంలో ఎప్పుడూ కుతూహలం కలిగి ఉండి,



వికసిత్ భారత్ కోసం విద్యార్థులు తమవంతు పాత్ర పోషించాలి. కొత్త సవాళ్లకు కొత్త పరిష్కారాలను కనుగొనే ధైర్యం ఎవరికైతే ఉంటుందో, ఆ సవాళ్లే వారికి అవకాశాలుగా మారుతాయి.”

**‘వికసిత్ భారత్’ సాకారంలో యువతదే కీలక పాత్ర**

‘వికసిత్ భారత్’ సాకారం చేయడంలో ?యువత తీసుకునే నిర్ణయాలే కీలక పాత్ర పోషిస్తాయని మోదీ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పురోగమిస్తున్నందున ప్రపంచ వ్యూహాత్మక సమీకరణాలు, అధికార సమతుల్యత నిరంతరం మారుతున్నాయని తెలిపారు. వికసిత్? భారత్ లక్ష్యాన్ని సాధించడానికి ఆర్థిక, సాంకేతిక, పారిశ్రామిక స్వావలంబన అవసరమని పిలుపునిచ్చారు. ప్రతి తరానికి కొన్ని సవాళ్లు, జాతీయ బాధ్యతలు ఉంటాయని, విద్యార్థులు తమ జీవితంలో రానున్న 35 ఏళ్లలో తీసుకునే నిర్ణయాలు ‘వికసిత్ భారత్’ ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. యువ శక్తి తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎలా ఉపయోగపడుతుంది, దేశ అవసరాలను ఎలా తీరుస్తుందనే కోణంలో ఉండాలని సూచించారు.

**స్వావలంబన అనేది వికసిత్ భారత్ అభివృద్ధికి పునాది**

ప్రతి రంగంలో స్వావలంబన అనేది వికసిత్ భారత్ అభివృద్ధికి పునాది అని మోదీ పేర్కొన్నారు. దేశంలో ‘చిప్ నుంచి షిప్’ వరకు ప్రతిదీ మన యువత చేతుల మీదుగానే తయారవుతుందని ఆయన నొక్కి చెప్పారు. డ్రోన్ వంటి సాంకేతిక రంగాల్లో యువత కొత్త అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు. వాటి సహాయంతో వ్యవసాయం, మందుల సరఫరా, దేశ రక్షణ, భద్రతలో సహాయపడుతున్నాయని చెప్పారు. యువ శక్తి ఆవిష్కరణల కోసం ఏఐ, డేటా కేంద్రాలు ఎదురుచూస్తున్నాయని, భారత్ సరికొత్త పరిశోధనలు కోరుకుంటోందని అన్నారు. అలాగే, అకాడమిక్ మౌలిక సదుపాయాలు మరింతగా పెంచామని, పరిశోధనల రంగానికి రూ.లక్ష కోట్ల నిధులు కేటాయించామని స్పష్టం చేశారు. కాగా, ఈ స్నాతకోత్సవంలో 587 మంది ౹ాౕణ స్కాలర్లతో సహా మొత్తం 3వేల మందికి పైగా విద్యార్థులు తమ పట్టాలను అందుకున్నారు. విద్యార్థులకు రాష్ట్రపతి స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకం, శంకర్‌దయాళ్ శర్మ స్వర్ణ పతకం, పర్‌ఫెక్ట్ టెన్ స్వర్ణ పతకాలను మోదీ బహుకరించారు.

**‘పరం ప్రజ్ఞ’ను ప్రారంభించిన ప్రధాని**

ఇదిలా ఉండగా, స్నాతకోత్సవ కార్యక్రమంలో భాగంగా ఐఐటీ దిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రమైన ‘పరం ప్రజ్ఞ’ను మోదీ ప్రారంభించారు. ఇది కృత్రిమ మేధ(ఏఐ) సామర్థ్యాలతో పనిచేసే అత్యంత ఆధునిక హై-పర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్ వ్యవస్థ. ఇది డేటా సైన్స్, అధునాతన కంప్యూటింగ్?, అంతర్విభాగ పరిశోధన రంగాల్లో సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుందని ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది.

# దేశ స్వాతంత్ర్యం కోసం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చేసిందేం లేదు

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఎలాంటి పాత్ర పోషించలేదని ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీయేనని, దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కూడా కాంగ్రెస్ నిరంతరం కృషి చేసిందని అన్నారు. ఈ మేరకు ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ఖర్గే పలు వ్యాఖ్యలు చేశారు

స్వాతంత్ర్యం పోరాటంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి సహకారం లేదని ఖర్గే అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లిన ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు ఎవరైనా ఉన్నారా? బీజేపీకి చెందిన వారు ఎవరైనా స్వాతంత్ర్యం ఉద్యమంలో జైలుకు వెళ్లారా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఎవరైనా జైలుకు వెళ్లినా వారు తొలుత కాంగ్రెస్‌లో ఉండి ఆ తర్వాత అటువైపు వెళ్లిన వారై ఉంటారని వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలెవరూ స్వాతంత్ర్యం ఉద్యమంలో పాల్గొన్న దాఖలాలు లేవని ఆరోపించారు.

**‘దేశభక్తిపై మాకు పాఠాలు చెబుతారా?’**

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యం ఉద్యమంలో భాగస్వామ్యం లేకపోయినా బీజేపీ నేతలు కాంగ్రెస్‌కు దేశభక్తిపై పాఠాలు, నీతులు చెబుతుంటారని ఖర్గే విమర్శించారు. అసలైన దేశభక్తులు కాంగ్రెస్ పార్టీకి చెందినవారేనని అన్నారు. కాంగ్రెస్ ఎవరినీ భయపడదని, ఎవరూ తమను భయపెట్టలేరని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం ఉద్యమంలో కాంగ్రెస్ పోషించిన పాత్రను ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన కోరారు.



**రాహుల్ గాంధీపై ప్రశంసలు**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటున్నారని ఖర్గే ప్రశంసించారు. యువత, రైతులు, విద్యార్థులు, పేదల సమస్యలను రాహుల్ గాంధీ నిరంతరం ప్రస్తావిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన దేశవ్యాప్తంగా ప్రజలను కలుస్తున్నారని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ భారత్ జోడో యాత్ర చేపట్టారని ఖర్గే గుర్తు చేశారు. దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఆయన ప్రజల్లోకి వెళ్లారని అన్నారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు రాహుల్ నిరంతరం పర్యటిస్తున్నారని చెప్పారు. బీజేపీలో ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకునే నాయకుడు ఎవరైనా ఉన్నారా? అని ఖర్గే ప్రశ్నించారు.

**క్విట్ ఇండియా ఉద్యమంతోనే!**

1942 ఆగస్టు 8వ తేదీన మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని మల్లికార్జున ఖర్గే గుర్తు చేసుకున్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆ రోజు ఎంతో కీలకమైందని చెప్పారు. డూ ఆర్ డై, క్విట్ ఇండియా నినాదాలతో మహాత్మా గాంధీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేశారని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమంతో దేశ ప్రజల్లో బ్రిటిష్ పాలనపై వ్యతిరేకత మరింత పెరిగిందని అన్నారు. ప్రజలంతా ఒక్కటై స్వాతంత్ర్యం కోసం పోరాడారని చెప్పారు. చివరకు బ్రిటిష్ పాలకులు దేశాన్ని విడిచి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అలాంటి చారిత్రక రోజున హల్ద్వానీలో భారీ బహిరంగ సభ జరగడం ఆనందగా ఉందని అన్నారు.

**ఉత్తరాఖండ్ త్యాగాలను కొనియాడిన ఖర్గే**

ఉత్తరాఖండ్?ను దేవభూమిగా పేర్కొన్న మల్లికార్జున ఖర్గే, ఆ ప్రాంతానికి దేశ రక్షణలో కూడా ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. కుమావోం, గర్వాల్ రెజిమెంట్లు దేశవ్యాప్తంగా ఎంతో పేరు పొందాయని చెప్పారు. ఆ ప్రాంతం నుంచి ఎంతోమంది సైనికులు దేశ రక్షణ కోసం సేవలందించారని గుర్తు చేశారు. దేశానికి తొలి పరమ్ వీర్ చక్ర అవార్డు అందుకున్న వీర సైనికుడు కూడా ఆ ప్రాంతం నుంచే వచ్చారని ఖర్గే పేర్కొన్నారు. దేశ రక్షణలో ఉత్తరాఖండ్ ప్రజల పాత్రను ఆయన కొనియాడారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడుకున్న సైనికులకు ప్రజలంతా గర్వపడాలని అన్నారు.


# సరిహద్దులకు 1కి.మీ పరిధిలో విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయొద్దు

దేశ సరిహద్దుల వెంబడి పునరుత్పాదక ఇంధన, విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. జాతీయ భద్రతకు ఎలాంటి ముప్పు తలెత్తకుండా సరిహద్దు ప్రాంతాల్లో సోలార్, విండ్, హైబ్రిడ్ ప్రాజెక్టుల ఏర్పాటును నియంత్రించాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. అందులో భాగంగా నియంత్రణ రేఖ, వాస్తవాధీన రేఖ, అంతర్జాతీయ సరిహద్దు నుంచి ఒక కిలోమీటర్ పరిధిలో కొత్తగా ఎలాంటి సౌర, పవన, హైబ్రిడ్ పునరుత్పాదక ప్రాజెక్టులను ఏర్పాటు చేయకూడదని శనివారం స్పష్టం చేసింది. సరిహద్దు నుంచి 50 కిలోమీటర్ల పరిధిని సున్నిత ప్రాంతంగా కేంద్ర హోంశాఖ గుర్తించింది. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న అన్ని సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు కేంద్ర హోంశాఖ నుంచి భద్రతా అనుమతి తప్పనిసరి. అయితే సరిహద్దు నుంచి ఒక కిలోమీటర్ వరకు మాత్రం ఎలాంటి ప్రాజెక్టు కార్యకలాపాలకు అనుమతి ఉండదు. ఒక కిలోమీటర్ నుంచి 50 కిలోమీటర్ల మధ్య ప్రతిపాదించే ప్రాజెక్టుల భద్రతా అనుమతిని కేంద్ర హోంశాఖ కేసుల వారీగా పరిశీలిస్తుంది. అదే విధంగా అంతర్జాతీయ సరిహద్దు నుంచి ఒక కిలోమీటర్ నుంచి 20 కిలోమీటర్ల పరిధిలోని ప్రాజెక్టులకు రక్షణశాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అవసరం. ఆ అనుమతిని కూడా ప్రాజెక్టు స్వభావం, ప్రాంతం, భద్రతా పరిస్థితులను బట్టి కేసుల వారీగా పరిశీలిస్తారు.

**సరిహద్దు దేశాల సిబ్బందిపై ఆంక్షలు**

ప్రాజెక్టుల నిర్మాణం, అమలు కోసం సరిహద్దు దేశాలకు చెందిన ఇంజినీర్లు, సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులను నియమించడంపైనా కేంద్రం ఆంక్షలు విధించింది. ముఖ్యంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనాకు చెందిన వ్యక్తులను కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతి లేకుండా ప్రాజెక్టు పనుల్లో నియమించకూడదు. ప్రాజెక్టు అమలు సంస్థకు చెందిన సిబ్బందిని క్షేత్రస్థాయిలోకి పంపించే ముందు వారి వివరాలను ముందస్తుగా ధ్రువీకరించాల్సి ఉంటుంది. అంతర్జాతీయ సరిహద్దు వద్ద విధులు నిర్వహిస్తున్న స్థానిక పోలీసులు, సరిహద్దు భద్రతా దళం ఇచ్చే సూచనలను ప్రాజెక్టు సిబ్బంది తప్పనిసరిగా పాటించాలి. విదేశీ పౌరులు సరిహద్దు ప్రాంతాల్లోకి ప్రవేశించినప్పుడు వారి కదలికలను పర్యవేక్షించాలని మార్గదర్శకాల్లో కేంద్రం పేర్కొంది.

ప్రాజెక్టు నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక పోలీసు ఔట్‌పోస్టును ఏర్పాటు చేయాలని కూడా సూచించింది.



సరిహద్దు ప్రాంతాల్లో ప్రాజెక్టుల కోసం కేటాయించిన భూమిని విదేశీ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా బదలాయించకూడదని హోంశాఖ స్పష్టం చేసింది. ఇందుకు కేంద్ర హోంశాఖ భద్రతా అనుమతి కూడా తీసుకోవాలి. ప్రాజెక్టులో విదేశీ పెట్టుబడులు ఉంటే అదనంగా పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానానికి అనుగుణంగా సంబంధిత అనుమతులు పొందాల్సి ఉంటుంది.

**దరఖాస్తు ప్రక్రియలో మార్పులు**

సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న అన్ని సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు సంబంధించిన దరఖాస్తులను కేవలం కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖకే సమర్పించాలి. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపునకు ఇచ్చిన సూత్రప్రాయ ఆమోదంతో పాటు ప్రాజెక్టు ప్రాంతానికి సంబంధించిన పూర్తి వివరాలను కూడా దరఖాస్తులో పేర్కొనాలి. కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ ఈ ప్రతిపాదనలను భద్రతా అనుమతి కోసం హోంశాఖకు, అవసరమైన చీూజ కోసం రక్షణశాఖకు పంపుతుంది. హోంశాఖ భద్రతా అనుమతి, రక్షణశాఖ నుంచి చీూజ వచ్చిన తర్వాతే ప్రాజెక్టుపై తుది నిర్ణయాన్ని ప్రాజెక్టు ప్రతిపాదకులకు తెలియజేస్తారు. సరిహద్దు వెంబడి ప్రాజెక్టు నిర్మాణాలు చాలా దూరం వరకు అంతర్జాతీయ సరిహద్దుకు సమాంతరంగా విస్తరించకుండా భూమి కేటాయింపులు ఉండేలా చూడాలని కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖకు సూచించారు.

**యాంటీ డ్రోన్ వ్యవస్థ తప్పనిసరి**

సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ప్రాజెక్టులు సమగ్ర భద్రతా ఏర్పాట్లు కలిగి ఉండాలి. యాంటీ డ్రోన్ వ్యవస్థ వంటి భద్రతా పరికరాలను ఏర్పాటు చేయాలి. వీటిని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (జ×ూఖీ) లేదా రాష్ట్ర పోలీసులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. ఆ భద్రతా పరికరాల ఏర్పాటు, నిర్వహణకు అయ్యే ఖర్చును మాత్రం ప్రాజెక్టు ప్రతిపాదకులే భరించాలి. అత్యవసర పరిస్థితుల్లో సరిహద్దు భద్రతా దళాలు, సాయుధ బలగాలు ఉపయోగించుకునేలా ప్రాజెక్టు ప్రాంతంలో తగినంత వెడల్పైన రహదారులను ఏర్పాటు చేయాలని కూడా కేంద్రం సూచించింది. సరిహద్దుకు సమీపంలోని సున్నిత ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలను ఆకర్షించే విధంగా వసతి గృహాలు, క్యాంటీన్లు, హౌసింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయకూడదని మార్గదర్శకాలు చెబుతున్నాయి. భద్రతా పరంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న సౌకర్యాలను ఈ ప్రాంతంలో అనుమతించకూడదు. హోటళ్లు, వసతి సదుపాయాలు సరిహద్దు నుంచి కనీసం 5 కిలోమీటర్ల దూరంలో ఉండాలి. అయితే క్యాంటీన్లను ప్రాజెక్టు ప్రాంగణంలోనే ఏర్పాటు చేసుకోవచ్చు.

**నిర్మాణాల ఎత్తుపైనా పరిమితి**

సరిహద్దు ప్రాంతాల్లో సివిల్ నిర్మాణాల ఎత్తుపై కూడా కేంద్రం పరిమితులు విధించింది. సరిహద్దు నుంచి 1 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలో నిర్మాణాల ఎత్తు గరిష్ఠంగా 3 మీటర్లు ఉండాలి. 8 నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో 5 మీటర్లకు, 20 నుంచి 50 కిలోమీటర్ల పరిధిలో 15 మీటర్లకు ఎత్తును పరిమితం చేశారు. ప్రాజెక్టుల నిర్వహణ, కార్యకలాపాలకు సంబంధించిన సివిల్ మౌలిక సదుపాయాలకు ఆ నిబంధనలు వర్తిస్తాయి. ఆ కొత్త మార్గదర్శకాలు జారీ చేయడానికి ముందే కేంద్ర హోంశాఖ నుంచి భద్రతా అనుమతి పొందిన ప్రాజెక్టులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని హోంశాఖ స్పష్టం చేసింది. అలాగే రక్షణశాఖ నుంచి ఇప్పటికే చీూజ పొందిన ప్రాజెక్టులకు కూడా కొత్తగా దరఖాస్తు అవసరం లేదు. సరిహద్దు ప్రాంతాల్లో సౌర, పవన, హైబ్రిడ్ ఇంధన ప్రాజెక్టులకు సంబంధించి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తుండటంతో ఆ మార్గదర్శకాలను రూపొందించినట్లు హోంశాఖ తెలిపింది.

## ‘మహిళా రిజర్వేషన్లకు షరతులెందుకు?’

మహిళా రిజర్వేషన్ల అమలుపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ఇవ్వాలని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ఎంపీ రాహుల్ గాంధీ గట్టిగా స్పందించారు. మహిళలకు శాసనసభల్లో రిజర్వేషన్లు కల్పించే 2023 నాటి చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలును లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అయిన డీలిమిటేషన్‌తో ఎందుకు ముడిపెడుతున్నారని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా ఈ విషయం తనకు మరింత బాగా తెలిసి ఉండాలని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 2023లో పార్లమెంటు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టానికి కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించే సమయంలో కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టంగా వెల్లడించిందన్నారు. అయితే చట్టం ఆమోదమై దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు దాని అమలును డీలిమిటేషన్‌తో అనవసరంగా ముడిపెట్టాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. 2023 నాటి చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

**అసలేం జరిగిదంటే?**

మహిళా శక్తి గురించి రాహుల్ గాంధీ మాట్లాడిన వీడియోను కాంగ్రెస్? ఎక్స్?లో విడుదల చేసింది. అందులో భారత మహిళల శక్తి బందీగా ఉండిపోయిందని, రాజకీయాలు, వ్యాపారాల్లోనే కాదు, సొంతింట్లో కూడా తమను తాము వ్యక్తపరచుకునే అవకాశం దొరకట్లేదని అన్నారు. కనీసం ఊహించుకునే స్వేచ్ఛ లేదని, వీధుల్లో సౌకర్యవంతంగా నడవలేకపోతున్నారని పేర్కొన్నారు. మహిళలు తమను తాము వ్యక్తపరచుకోలేని ఏ దేశమూ విజయం సాధించలేదని భావిస్తున్నట్లు చెప్పారు. మహిళల భాగస్వామ్యం లేకపోతే, వారి గళం వినిపించే అవకాశం రాకపోతే, మన దేశం అసంపూర్ణంగా, కుంటుపడిన స్థితిలోనే ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చేయడమే తాను చేసే రాజకీయాల్లో కీలకమైన అంశమని అన్నారు.

**రాహుల్ ఆలోచనా విధానంలో మార్పు : కిరణ్ రిజిజు**

దీనిపై కిరణ్ రిజిజు స్పందిస్తూ కాంగ్రెస్?పై విమర్శలు చేశారు. మహిళల విషయంలో రాహుల్ గాంధీ ఆలోచనా విధానంలో మార్పు కనిపిస్తోందని తెలిపారు. అదే స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ షరతులు లేని మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాఖ్యలకే రాహుల్ గాంధీ తాజాగా సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ఇప్పటికే బిల్లుకు మద్దతు తెలిపిందని, కొత్తగా మద్దతు ప్రకటించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బదులుగా ఆమోదించిన చట్టాన్ని అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు.

**మహిళలకు 33 శాతం రిజర్వేషన్**

2023లో తీసుకొచ్చిన నారీ శక్తి వందన్ అధినియమ్ ద్వారా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రతిపాదన ఉంది. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. ఈ చట్టం పార్లమెంటులోని రెండు సభల్లోనూ ఆమోదం పొందింది. అయితే దాని అమలుకు సంబంధించిన తదుపరి ప్రక్రియ ముందుకు సాగలేదు. రాజ్యాంగ సవరణకు సంబంధించిన 131వ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక ఏప్రిల్ 17న విగిపోయింది. మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత చేపట్టాలన్న నిబంధనపై కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన రెండింటినీ ఒకదానితో ఒకటి అనుసంధానం చేయకూడదన్నది విపక్షాల ప్రధాన డిమాండ్. లోక్‌సభలో రాష్ట్రాల వారీగా స్థానాల సంఖ్యను పునఃపరిశీలించే డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందన్న వాదనలతో ఈ అంశంపై రాజకీయ చర్చ కొనసాగుతోంది.

## చైనా మ్యాప్ వార్‌కు భారత్ గట్టి కౌంటర్..

అరుణాచల్ ప్రదేశ్ విషయంలో చైనా దూకుడుకు కళ్లెం వేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 27 వ్యూహాత్మక ప్రాంతాలకు అధికారికంగా పేర్లను ఖరారు చేసింది. ఈ పేర్లను సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో చేర్చనున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ జాబితాలో అప్పర్ సుబన్‌సిరి జిల్లాలోని లాంగ్జూ, మాజా, బిసా వంటి కీలక సరిహద్దు గ్రామాలు ఉన్నాయి. వీటితో పాటు, జో లా, రిజా లా, పుకుర్ లా, థాగ్ లా అనే నాలుగు పర్వత కనుమలు, ఎత్తైన సంభో సరోవర్ సరస్సు, షేర్-ఎ-థాపా స్మారక చిహ్నం వంటి ప్రదేశాలు కూడా ఉన్నాయి. అంజావ్, చాంగ్‌లాంగ్, వెస్ట్ కామెంగ్, లోహిత్, తవాంగ్ జిల్లాల్లోని పలు ప్రాంతాలకు కూడా పేర్లను స్థిరీకరించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా పదేపదే కొత్త పేర్లు పెడుతూ వివాదం సృష్టిస్తున్న నేపథ్యంలో, భారత్ ఈ చర్యలు చేపట్టింది. ఈ ప్రాంతాలపై స్పష్టత ఇవ్వడం, ప్రజలకు అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రదేశాల్లో చాలా వరకు ఇప్పటికే భారత సైనిక మ్యాపుల్లో ఉన్నాయని, ఇప్పుడు సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో చేర్చడం ద్వారా ప్రాదేశిక సరిహద్దులపై ఎలాంటి అస్పష్టత లేకుండా పోతుందని అధికారులు వివరించారు. 1959 నాటి లాంగ్జూ ఘటన, 1962 యుద్ధంతో సంబంధం ఉన్న చారిత్రక ప్రదేశాలు కూడా ఈ జాబితాలో ఉండటం గమనార్హం. పేర్లు మార్చినంత మాత్రాన అరుణాచల్ ప్రదేశ్ తమ అంతర్భాగమన్న వాస్తవం మారదని భారత్ ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తూనే ఉంది. ఈ తాజా నిర్ణయంతో తన ప్రాదేశిక సమగ్రత విషయంలో భారత్ ఎంత దృఢంగా ఉందో మరోసారి స్పష్టమైంది.

## ఒక సగం అక్కడ, మరో సగం ఇక్కడ
## రెండు జిల్లాల బార్డర్‌లో ప్రైమరీ స్కూల్

ఆ స్కూల్ రెండు జిల్లాల సరిహద్దులో ఉంది. పాఠశాలలో కొంత భాగం ఒక జిల్లాలో, ఇంకొక భాగం మరో జిల్లాలో ఉంది. అలాగే ఆ పాఠశాలను నిర్వహిస్తున్న జిల్లాలోని విద్యార్థులు ఆ స్కూల్‌లో చదవట్లేదు. పొరుగు జిల్లా స్టూడెంట్స్ అందులో విద్యనభ్యసిస్తున్నారు. ఇంతకీ ఆ స్కూల్ పేరేంటి? అది ఎక్కడుంది? ఏయే జిల్లాల బార్డర్‌లో ఉంది? తదితర విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం. బిహార్‌లోని పట్నా, నలంద జిల్లాల సరిహద్దులోని దక్షిణ్‌పుర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. పరిపాలనాపరంగా ఆ పాఠశాల పట్నా జిల్లాలోని బెల్చి-కొరారి పంచాయతీ పరిధిలోకి వస్తుంది. అయితే ఆసక్తికరమైన విషయమేమిటంటే ఇక్కడ చదువుతున్న విద్యార్థులందరూ నలంద జిల్లాలోని హర్నౌట్ ప్రాంతానికి చెందినవారు. దక్షిణ్‌పుర్ గ్రామంలోని ఈ ప్రాథమిక పాఠశాల తూర్పు భాగం పట్నా జిల్లాలో ఉండగా, పశ్చిమ భాగం నలంద జిల్లా పరిధిలోకి వస్తుంది. దశాబ్దాల క్రితం ఏర్పాటైన ఈ స్కూల్‌ను పట్నా జిల్లా యంత్రాంగమే నిర్వహిస్తోంది. ఈ విచిత్రమైన సరిహద్దు విభజన వల్ల విద్యార్థులు, గ్రామస్థులు, స్కూల్ టీచర్స్ గందరగోళానికి గురవుతున్నారు. దక్షిణ్‌పుర్ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 52 మంది పిల్లలు చదువుతున్నారని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అంజలి కుమారి తెలిపారు. రోజువారీ హాజరు సగటున 40-43 మంది వరకు ఉంటుందని పేర్కొన్నారు. తాము పట్నా జిల్లాలో ఉద్యోగం పొందామని చెప్పారు. అయితే తమ స్కూల్‌లో చదివే విద్యార్థుల ఆధార్ కార్డులలో వారి చిరునామాలో జిల్లా పేరు నలంద అని ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులందరూ నలంద జిల్లా నుంచి తమ స్కూల్‌కు చదువుకోవడానికి వస్తారని వెల్లడించారు. రెండు జిల్లాల బార్డర్‌లో ఉన్న ఈ గ్రామంలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయని అన్నారు. అయితే గ్రామస్థులు, విద్యార్థులు సరైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. “విద్యార్థులు స్కూల్‌కు రావడానికి సరైన రహదారి లేదు. వర్షాకాలంలో మట్టి రోడ్డు బురదమయమవుతోంది. అంతేకాకుండా గ్రామస్థుల్లో అవగాహన లోపం వల్ల దారి వెంబడి చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఇంట్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వారు రోడ్డు పక్కనే బహిరంగంగా మలవిసర్జన చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాతో పాటు మరో టీచర్ ఈ స్కూల్‌లో పనిచేస్తున్నారు. ప్రభుత్వం రోడ్డును వేయాలి. అలాగే స్కూల్‌లో ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలి” అని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అంజలి కుమారి విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ నాయకత్వంలో మరో తెలంగాణ ఉద్యమం చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఇండస్ట్రియల్ అసోసియేషనర్లకు లేఖ రాస్తానని తెలిపారు. బీఆర్?ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే ఈ పాలసీని రద్దు చేస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమ కోసం ఇంకోచోట భూమి ఇస్తున్నప్పుడు ఈ భూమిని ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇవాళ మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన ఆయన హిల్ట్ పాలసీ కింద చెల్లింపులు చేసేవారు ఆర్థిక నష్టాన్ని చవిచూస్తారని హెచ్చరించారు. పారిశ్రామికవేత్తలు భూ మాఫియాతో కుమ్మక్కు కావొద్దని? విజ్ఞప్తి చేశారు.
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేయలేదని కేటీఆర్? పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు నిర్వహిస్తున్న వరుణ యాగాలు సహా వివిధ అంశాలపై ఆయన స్పందించారు. యాగాలు చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం తన బాధ్యతలను కూడా నిర్వర్తించాలని తెలిపారు. దైవానుగ్రహానికి మానవ ప్రయత్నం తోడైనప్పుడే ఫలితాలు లభిస్తాయని హితవు పలికారు.

**'కాంగ్రెస్‌వి సిగ్గుమాలిన రాజకీయాలు'**



హరీశ్‌రావు దేవాలయానికి వెళ్తే కాంగ్రెస్ నాయకులు చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని కేటీఆర్? విమర్శించారు. చేతబడి, క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నీచమైన, సిగ్గులేని రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. వ్యవసాయం, రైతుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డికి కనీస అవగాహన గానీ చిత్తశుద్ధి గానీ లేవని ఆక్షేపించారు. పాల మూరు బిడ్డనని చెప్పుకునే సీఎం ఆ జిల్లాకే సాగునీరు అందించడంలో విఫలమవుతున్నారని ఆయన? విమర్శించారు.

**కేసీఆర్ నాయకత్వంలో భారీ పోరాటం**

అధికారంలో ఉన్నా లేకపోయినా తాము ఎప్పుడూ రాష్ట్ర శ్రేయస్సునే కోరుకుంటామని కేటీఆర్? చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధమన్న ఆయన 24 గంటల విద్యుత్ సరఫరా ఎక్కడ ఉందో కాంగ్రెస్ నాయకులు తనకు చూపించాలని సవాలు విసిరారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్ నీటిని తరలిస్తున్నా ఈ ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటోందని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కులను ఏపీ హరిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తాము బీభత్సమైన పోరాటం చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్థాయిలోనే మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు. గోదావరి బోర్డు సమావేశంపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం హైదరాబాద్?లో హైడ్రా పేరుతో పేదల కడుపు కొడుతోందంటూ ఆయన విమర్శించారు.

# ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో వసూళ్ల దందా!

-మొదటిపేజీ తరువాయి

వెసులుబాటు లభిస్తుంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఎన్‌బీఏ అధికారులను సంప్రదిస్తున్నారు.

**ఖర్చులుంటాయిగా అంటూ సమాధానాలు**

ఎన్‌బీఏ అక్రిడిటేషన్ పేరుతో వసూళ్లపై కొందరు తల్లిదండ్రులు, కాలేజీ సిబ్బందిని ప్రశ్నించగా నిర్వహణ ఖర్చులుంటాయిగా అంటూ దురుసుగా సమాధానాలిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం జేఎన్?టీయూ అధికారులు ఒక్కో విద్యార్థి నుంచి రూ.5,500లు వసూలు చేసుకోవాలని మౌఖికంగా ఆదేశించారు. కానీ కొన్ని కళాశాలలు రూ.22 వేల వరకూ వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.నాగయ్యను వివరణ కోరగా వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

**అత్యధికంగా సీబీఐటీకి రూ.1.83 లక్షలు**



రాష్ట్రంలో 33 ఇంజినీరింగ్ కళాశాలల్లో లక్ష రూపాయలకు పైగా, రెండు కళాశాలలకు లక్ష రూపాయలుగా ఫీజును నిర్ణయించారు. ఈ మేరకు మొత్తం 160 ఇంజినీరింగ్? కాలేజీలకు కొత్త ట్యూషన్? ఫీజులను నిర్ధారిస్తూ విద్యాశాఖ ఇటీవల జీవో జారీ చేసింది. ఈ రుసుములు 2025–28 బ్లాక్? పీరియడ్?కు వర్తిస్తాయి. గత బ్లాక్? పీరియడ్?లో ఫీజు లక్ష రూపాయలు దాటిన కళాశాలల సంఖ్య 33 ఉండగా ఈసారీ అంతే ఉండటం విశేషం. ఫీజు లక్ష రూపాయలు ఉన్న కళాశాలల సంఖ్య అప్పట్లో 7 కాగా ఇప్పుడు 2కి తగ్గింది. అత్యధికంగా సీబీఐటీకి ఫీజు రూ.1.83 లక్షలుగా నిర్ణయించారు. తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ 19 కళాశాలలకు ఇప్పటివరకు ఉన్న ట్యూషన్? ఫీజులను తగ్గించడంతో పాటు 70 కళాశాలలకు ఒక్క రూపాయి కూడా పెంచకుండా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దానికి ఆమోదం తెలుపుతూ సర్కారు జీవో జారీ చేసింది. కనీస ఫీజు రూ.45 వేలు ఉండగా 21 కళాశాలలకు ఆ రుసుమును ఖరారు చేశారు. తాజాగా నిర్ణయించిన ఫీజులు ప్రస్తుత (2025–26) నుంచే అమల్లోకి వస్తాయి. మూడేళ్ల బ్లాక్? పీరియడ్? అంటే 2025–26,2026–27,2027–28 విద్యా సంవత్సరాల్లో బీటెక్? మొదటి సంవత్సరంలో చేరినవారికి ఈ ఫీజులు వర్తిస్తాయి. ఆ విద్యార్థులు 4 ఏళ్ల పాటు అవే రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. 19 కళాశాలల్లో తగ్గిన ఫీజులు : ఈ ఏడాది 19 కళాశాలలకు ఫీజు తగ్గించారు. అంటే గత విద్యా సంవత్సరం (2024–25) వరకు ఉన్న ఫీజులో టీఏఎఫ్?ఆర్?సీ కోత పెట్టింది. గత ఆగస్టులో ఎప్?సెట్? కౌన్సెలింగ్? సందర్భంగా విద్యార్థుల నుంచి పాత ఫీజులనే వసూలు చేశారు. ప్రభుత్వం కొత్త ఫీజులను నిర్ణయించిన తర్వాత ఒకవేళ తగ్గితే ఆ వ్యత్యాసాన్ని వెనక్కి చెల్లించాల్సి ఉంటుందని సాంకేతిక విద్యాశాఖ అప్పట్లో పేర్కొంది. ఈసారి 19 కళాశాలల్లో ఫీజు తగ్గడంతో అక్కడ సొంతంగా ఫీజు చెల్లించినవారికి ఆయా కాలేజీలు ఆ వ్యత్యాసం మొత్తాన్ని వెనక్కి ఇవ్వాల్సి ఉంటుంది.

# మనస్సు పులకించేలా పాకాల సరస్సుకు కొత్త సొబగులు

## విశేషంగా ఆకట్టుకుంటున్న అభివృద్ధి పనులు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చారిత్రక కట్టడాలు, దర్శనీయ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లాలోని కాకతీయుల పాలనా వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్న పాకాల సరస్సును అటవీ శాఖ అధికారులు మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పర్యాటకులకు ఆహ్లాదకర మైన వినూత్న మధురానుభూతులు కలిగించేలా సరికొత్తగా ముస్తాబు చేస్తున్నారు. ప్రకృతి అందాలతో సహజ సిద్ధంగా ఉన్న పాకాల ఇప్పుడు ఆధునిక హంగులతో కొత్త రూపు సంతరించుకుంటోంది.



**రాత్రి పూట కూడా బస చేసేలా**

పాకాల అభయారణ్యంలోని బయోడైవర్సిటీ పార్కులో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ రాత్రిపూట కూడా బస చేసేందుకు వసతులు కల్పించనున్నారు. సరస్సు కట్ట వెంబడి పాకాల ప్రత్యేకతలను తెలిపేలా ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి కోసం ఆర్?వో ప్లాంట్‌ను కూడా నెలకొల్పారు.

**చిలుకలగుట్టకు ట్రెక్కింగ్ చేసేలా**

తుంగబంధం సమీపంలోని తూము కింద ఉన్న కేన్ పార్క్ నుంచి గెస్ట్ హౌజ్ వరకు ఒక ట్రెక్కింగ్ మార్గాన్ని ఏర్పాటు చేశారు. సరస్సు మధ్యలో ఉన్న చిలుకలగుట్ట దాకా ట్రెక్కింగ్, సఫారీ సేవలను అందించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చిలుకమ్మనగర్ మీదుగా 8 కిలోమీటర్ల సఫారీ ప్రయాణం చేసి, ఆ తర్వాత చిలుకలగుట్ట మీదికి చేరుకునేందుకు ట్రెక్కింగ్ చేసేలా ఒక రూట్ మ్యాప్ తయారు చేశారు. చిలుకలగుట్ట మీద నిర్మించిన రెండు అంతస్తుల వాచ్‌టవర్ మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. దీని పైనుంచి సందర్శకులు సరస్సు, సమీపంలోని చెరువులు, కొండల మధ్య పరచుకున్న పచ్చదనం, విదేశీ వలస పక్షులతో పలు వన్యప్రాణులు కనువిందు చేసే అద్భుత దృశ్యాలను వీక్షించవచ్చు.

**అటవీ సంరక్షణపై అవగాహన కోసం**

పాకాల అభయారణ్యం అనేక రకాల వన్యప్రాణులకు, ఔషధ మొక్కలకు నిలయం. పర్యాటకులకు అటవీ రక్షణపై అవగాహన కల్పించేలా పాకాల నుంచి మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ ప్రాంతం వరకు అటవీ ప్రాంతంలో సఫారీ పర్యటనలను నిర్వహించేందుకు ప్రతిపాదించారు. సహజంగానే పక్షులు, వన్యప్రాణులను వీక్షించేందుకు వీలుగా రెండు వాచ్‌టవర్‌లను ఏర్పాటు చేశారు. సౌరశక్తితో పనిచేసే మోటార్లను అమర్చి నీటి గుంతల నిర్మాణం చేపట్టి వన్యప్రాణుల దాహం తీర్చేలా చర్యలు చేపట్టారు.

**కట్టపై సైకిల్ సవారీ చేసేలా**

పాకాల అభయారణ్యంలో సఫారీ చేయొచ్చు. ఇందుకు ఒక్కొక్కరికి రూ.250 ఖర్చవుతుంది. అలాగే ప్రత్యేకంగా సఫారీ వాహనాన్ని రూ.2 వేలకు అద్దెకు తీసుకోవచ్చు. పాత అతిథి గృహం వద్ద రాత్రిపూట బస చేయడానికి ఒక్కొక్కరికి రూ.800 రుసుమును నిర్ణయించారు. గతంలో పర్యాటక శాఖ నిర్వహణలో ఉన్న ఏడు హరిత కాటేజీలను అటవీ శాఖకు బదిలీ చేశారు. ప్రస్తుతం వాటిని ఆధునికరిస్తున్నారు. సందర్శకుల కోసం క్యాంటీన్ సదుపాయాలను కల్పించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. పాకాల కట్ట వెంబడి సందర్శకులు ప్రయాణించేందుకు వీలుగా బ్యాటరీతో నడిచే వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. 'సైకిల్ రైడ్'? ద్వారా గంటకు రూ.20 చొప్పున సైకిళ్లను అద్దెకిస్తున్నారు.

**పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాట్లు**

పాకాల కట్ట దిగువన చిల్డ్రన్ పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నారులు ఆడుకోవడానికి జంపింగ్, ట్రాంఫోలిన్, టైర్‌నెట్, రోప్ టైర్స్ వంటి వివిధ రకాల ఆట వస్తువులను అందుబాటులో ఉంచారు. పక్కనే ఉన్న బట్టర్ ఫ్లై గార్డెన్‌లో రంగురంగుల సీతాకోక చిలుకలను చూస్తూ సెల్ఫీలు దిగొచ్చు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఫంక్షన్లు, పార్టీలు చేసుకోవడానికి కట్ట దిగువన గణపతిదేవ వన మండపం నిర్మించారు. ఇక్కడ ప్రత్యేకంగా ఫోటో షూట్ కూడా అందుబాటులో ఉంది.

## తెలంగాణ ప్రజలకు ట్రిపుల్ బొనాంజా

-మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించనుడండగా.. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పంపిణీ చేయనున్నారు. ఈ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు లబ్దిదారుల అడ్రస్, పేర్లు ఉంటాయి. ఇక సీఎం రేవంత్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉంటాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా లబ్దిదారుల వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. ఇక కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్లను ఇప్పటివరకు మంజూరు చేయలేదు. అయితే ఆగస్ట్ 15వ తేదీ నుంచి అర్హులైనవారికి కొత్త పింఛన్లను మంజూరు చేయనున్నారు. ఇప్పటికే అర్హులైనవారి నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. వారిలో అర్హులను గుర్తించి లబ్దిదారుల జాబితాలో చేర్చింది. పించన్ సొమ్మును నేరుగా లబ్దిదారుడి బ్యాంక్ ఖాతాలో వేయనున్నారు. గతంలో పోస్టాఫీస్ ద్వారా అందించేవారు. అయితే ఇప్పుడు నేరుగా బ్యాంక్ అకౌంట్లో జమ చేయనున్నారు.

**కొత్త పింఛన్ల పంపిణీ**

దాదాపు 2.50 లక్షల మందికి ఆగస్ట్ 15న పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు చేనేత, గీత కార్మికులు ఇందులో ఉన్నారు. ఇక ఇదే రోజు గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం అమల్లోకి తీసుకురానున్నారు. ఆన్ లైన్ ఫుడ్, క్యాబ్, గ్రోసరీ డెలివరీ కార్మికులకు అండగా ఈ చట్టం తీసుకోస్తున్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం పలు నిర్ణయాలు అమలు చేయనున్నారు. వారికి వేతన కొత, అన్యాయ అంక్షల నుంచి రక్షణ కల్పించనున్నారు. ఈ మేరకు గిగ్ వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్నారు.

## సాగునీటి నిర్వహణ డిజిటలైజేషన్

-మొదటిపేజీ తరువాయి

సిద్ధమవుతోంది. కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో "డబ్ల్యూ–అమృతం" పథకంపై రాష్ట్ర నీటిపారుదలశాఖ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. డిజిటల్ విధానం ద్వారా వరదలు, కరవు పరిస్థితులను ముందుగానే అంచనా వేయడం మొదలు ప్రాజెక్టుల నిర్వహణ, చెరువుల పర్యవేక్షణ వంటివి ఒకే వేదికపైకి తీసుకురానున్నారు. కేవలం నీటి వివరాల సేకరణకే పరిమితం కాకుండా, ఆ సమాచారం ఆధారంగా సాగునీటి పంపిణీ, జలాశయాల నిర్వహణ, వరద నియంత్రణ, కరువు నిర్వహణలో శాస్త్రీయ నిర్ణయాలు తీసుకునే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. 2021 నుంచి 2025 మధ్య రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.35 కోట్లతో అభివృద్ధి చేసిన ఇరిగేషన్ డెసిషన్ సపోర్ట్ సిస్టమ్, గోదావరి బేసిన్ డిజిటల్ ట్విన్ సిస్టమ్‌ను ఇందులో ఉపయోగించనున్నారు. వీటన్నింటినీ సమన్వయం చేస్తూ 'స్టేట్ వాటర్ ఇన్ఫర్మేటిక్ సెంటర్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ఎన్‌డబ్ల్యూఐసీ ద్వారా రియల్ టైమ్ డేటా**

తక్కువ సమయంలో వచ్చే వరదలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసే 'ఎర్లీ వార్నింగ్' సిస్టమ్‌ను డబ్ల్యూ–అమృతం పథకం కింద మరింత బలోపేతం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,077 ఆటోమేటిక్ రెయిన్ గేజ్ స్టేషన్ల సమాచారాన్ని ఇరిగేషన్ డెసిషన్ సపోర్ట్ సిస్టమ్‌తో అనుసంధానిస్తారు. నేషనల్ వాటర్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ ద్వారా రియల్ టైమ్ డేటా అందుబాటులోకి రానుంది. డ్యామ్ సేఫ్టీ చట్టానికి అనుగుణంగా ప్రాజెక్టులకు ప్రత్యేక వరద హెచ్చరిక ప్రోటోకాల్స్ రూపొందిస్తారు. లైడార్ సర్వేలు చేసి, హై రెజల్యూషన్ డిజిటల్ ఎలివేషన్ మోడల్స్, వరద ముంపు మ్యాపింగ్, ఫ్లడ్ ప్లెయిన్ జోనింగ్ వంటి ఆధునిక వ్యవస్థలను కూడా అభివృద్ధి చేయనున్నారు.

**సర్వే ద్వారా కెపాసిటీ కర్వ్‌లను సిద్ధం**

రాష్ట్రంలో కోటి 25 లక్షల ఎకరాల సాగుభూమిలో దాదాపు 75 లక్షల ఎకరాలు ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి ఉంది. భారీ వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు గోదావరి బేసిన్‌లో విజయవంతమైన డిజిటల్ ట్విన్ టెక్నాలజీని, కృష్ణా బేసిన్‌తో విస్తరించాలన్నది ప్రభుత్వ ప్రతిపాదన. రాష్ట్రంలోని 44 వేల చిన్ననీటి వనరులు, చెరువుల నిర్వహణను కూడా డిజిటల్ పద్ధతిలో చేపట్టనున్నారు. మరోవైపు ప్రధాన జలాశయాల్లో పూడిక కారణంగా కోల్పోయిన నిల్వ సామర్థ్యాన్ని గుర్తించేందుకు బాథిమెట్రిక్ సర్వే ద్వారా కెపాసిటీ కర్వ్‌లను సిద్ధం చేస్తారు. కాల్వల ద్వారా సాగునీటి పంపిణీని ఆధునిక సాంకేతికతతో నిర్వహించేందుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నారు.

**ప్రవాహం రియల్ టైమ్‌లో పర్యవేక్షణ**

కాల్వల వద్ద వాటర్ లెవల్ సెన్సార్లు, ఫ్లో మీటర్లు, గేట్ పొజిషన్ సెన్సార్లు, సోలార్ ఆధారిత స్మార్ట్ మానిటరింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి నీటి విడుదల, ప్రవాహం రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తారు. ఉపగ్రహాల సాయంతో ఆయకట్టు పంటల స్థితిని విశ్లేషిస్తూ ఇంజినీర్లకు ఎప్పటికప్పుడు నిర్వహణ సూచనలు అందిస్తారు. వరదలే కాదు కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కూడా డబ్ల్యూ–అమృతం ప్రాజెక్టులో ప్రత్యేక వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్తులో వాతావరణ మార్పులను అంచనా వేసి కరవు సంవత్సరాల్లో నీటి కేటాయింపులు, జలాశయాల నిర్వహణకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయనున్నారు.

## నేడు నర్సంపేటకు కేసీఆర్

**పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి ఆర్థికసాయం చేయాలని నిర్ణయం**

**రేపు వరంగల్ జిల్లా నర్సంపేటకు వెళ్లనున్న కేసీఆర్**

**పెద్ది సుదర్శన్ కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థికసాయం చేయాలని నిర్ణయం**

**ఎల్లకాలం పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్న కేసీఆర్**



మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటకు వెళ్లనున్నారు. దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామం నల్లబెల్లికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించనున్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇవ్వనున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని నిర్ణయం తీసుకుంది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆయన కుటుంబానికి పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చేయనున్నారు. ఈ మేరకు పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించి కేసీఆర్ ఈ మేరకు నిర్ణయించారు. సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున, ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం మరో రూ.25 లక్షలు, మొత్తంగా రూ.2.25 కోట్లు ఇవ్వాలని, ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేయాలని నిర్ణయించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, చదువు, కుటుంబ సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉంటుందని కేసీఆర్ భరోసానిచ్చారు.

**గత నెల 31న పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి**

గత నెల 26న ఉదయం హనుమకొండలో పెద్ది సుదర్శన్?రెడ్డికి ఛాతీలో నొప్పి రావటంతో స్థానికంగా రోహిణి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కార్డియాక్ అరెస్ట్‌గా గుర్తించారు. గంట సేపు శ్రమించి తొమ్మిదిసార్లు సీపీఆర్ చేశాక కొంత ఫలితం కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. 5 రోజులు మృత్యువుతో పోరాడిన పెద్ది సుదర్శన్ రెడ్డి గత నెల 31న కన్నుమూశారు.

**అంచెలంచెలుగా ఎదిగిన సుదర్శన్ రెడ్డి**

1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లిలో రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్ రెడ్డి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన, 2014లో నర్సంపేట నుంచి బీఆర్?ఎస్? తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని ప్రతిజ్ఞ చేసి, రాష్ట్రం సిద్ధించిన తరువాతే 2017లో లక్ష్మీ ప్రసన్న(స్వప్న)ను వివాహమాడారు. 2016లో తెలంగాణ సివిల్ సప్లయ్స్? కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2018లో నర్సంపేట నుంచి బీఆర్?ఎస్? ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవిచూశారు.

## సంపాదకీయం

# విద్యావిధానంలో మార్పులు అనివార్యమా

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను కేవలం ఒక వ్యక్తి రాజకీయ పరాజయంగా మాత్రమే చూడకూడదు. అది భారత విద్యా వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోతున్న లోతైన సంస్థాగత సంక్షోభానికి ప్రతీకగా భావించాలి. ఈ రాజీనామా ప్రజా ఒత్తిడితో జరిగిందా, రాజకీయ వ్యూహంలో భాగమా అన్నది పక్కన పెడితే, విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. భారతదేశం తన పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పగలదా? బాధ్యత అనేది కేవలం రాజకీయ త్యాగాలకు మాత్రమే పరిమితమవుతుందా? మౌనంగా ఉండేందుకు నిరాకరిస్తున్న యువత ఆకాంక్షలకు పాలన అనుగుణంగా మారగలదా? విద్యార్థుల ఉద్యమం ఒక చారిత్రక విజయాన్ని సాధించింది. మంత్రి రాజీనామా ప్రజాస్వామ్య పోరాటానికి నైతిక విజయమే అయినప్పటికీ, ఒక వ్యక్తిని మార్చడం ద్వారా వ్యవస్థాగత లోపాలు తొలగిపోతాయని భావించడం సరళీకరణ అవుతుంది. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అక్రమాలు, పరిపాలనా పారదర్శకత లోపం, విద్యాసంస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి సమస్యలు దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక వైఫల్యాలు. ఒక రాజీనామాతో అవి అంతరించిపోవు. ఈ ఉద్యమంలో అత్యంత విశేషమైన అంశం జనరేషన్ -జెడ్ ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా అవతరించడం. గతంలో విద్యార్థి ఉద్యమాలు రాజకీయ పార్టీల ఆధిపత్యంలో నడిచినప్పటికీ, ఈ ఉద్యమం డిజిటల్ సమీకరణ, వికేంద్రీకృత నాయకత్వం, సమస్యల ఆధారిత రాజకీయాల చుట్టూ రూపుదిద్దుకుంది. నేటి యువతకు సిద్ధాంత నినాదాల కంటే విద్యా న్యాయం, ఉపాధి అవకాశాలు, పారదర్శక పరిపాలన వంటి అంశాలే ముఖ్యంగా మారాయి. ఇది భారత ప్రజాస్వామ్యంలో భాగస్వామ్య స్వరూపం మారుతున్నదనడానికి నిదర్శనం. ఈ నిరసనలు పరీక్షా సంస్కరణలకే పరిమితం కాకుండా, యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా మారాయి. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి, వరుసగా జరుగుతున్న పరీక్షా అవకతవకలు, ప్రభుత్వ సంస్థలపై తగ్గుతున్న నమ్మకం -ఇవన్నీ కలిసి యువతలో తీవ్ర నిరాశను కలిగించాయి. అందువల్ల ఈ ఉద్యమం ఒక పరీక్ష గురించి మాత్రమే కాకుండా, ఒక తరం భవిష్యత్తు గురించి సాగిన పోరాటంగా మారింది ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి స్పందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. బాధ్యత అనేది రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అయితే అది కేవలం మంత్రి రాజీనామాతో ముగియకూడదు. పరీక్షల నిర్వహణ సంస్థలు, నియామక సంస్థలు, పోలీసు దర్యాప్తు యంత్రాంగం, సైబర్ భద్రతా వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పోటీ పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అన్ని పరిపాలనా సంస్థలకు కూడా సమానంగా వర్తించాలి. సంస్థాగత బాధ్యత లేకుండా రాజకీయ బాధ్యత ప్రతీకాత్మకంగానే మిగిలిపోతుంది. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య ప్రజాస్వామ్య పాలనలో మరో కీలక కోణాన్ని గుర్తుచేస్తుంది. శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధ హక్కు. అదే సమయంలో చట్టం, శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతను పాటిస్తూ, పోలీసు చర్యలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పౌరహక్కులను గౌరవించే విధంగా ఉండాలి. ప్రజాస్వామ్యం విభేదాలను అణచివేయడం వల్ల కాదు; ప్రజల ఆందోళనలను నిర్మాణాత్మకంగా వినడం వల్ల బలపడుతుంది. సమకాలీన రాజకీయ చర్చలను ప్రభావితం చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కూడా ఎంతో పెరిగింది. మీమ్స్, వ్యంగ్య చిత్రాలు, డిజిటల్ ప్రచారాలు ప్రజల దృష్టిని ఆకర్షించే శక్తివంతమైన సాధనాలుగా మారాయి. అయితే అవి సంక్లిష్టమైన విధాన చర్చలను అతిగా సరళీకరించే ప్రమాదం కూడా ఉంది. ప్రజాభిప్రాయం వైరల్ కథనాల కంటే ఆధారాలతో కూడిన సమాచారంపై ఆధారపడాలి. అదే విధంగా, ఇ-20 ఇథనాల్ మిశ్రమ ఇంధనం చుట్టూ జరిగిన చర్చలు ప్రజల విశ్వాసం పారదర్శకమైన శాస్త్రీయ సమాచారంపై ఆధారపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, సాంకేతిక మార్పులకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు నిరంతర ప్రజా చర్చకు లోనవ్వాలి. ప్రజలకు ప్రయోజనాలు, ఖర్చులు, దీర్ఘకాలిక ప్రభావాలపై స్పష్టమైన ఆధారాలతో కూడిన సమాచారం అందించాలి. ఈ రాజీనామా భారత రాజకీయాల్లో ఒక మలుపుగా నిలుస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రజల నిరంతర ఒత్తిడి ప్రభుత్వాలను తమ నిర్ణయాలను పునఃపరిశీలించడానికి దారితీయగలదనే విషయాన్ని ఇది సూచిస్తుందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై తుది తీర్పు భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య చరిత్రలో ఇటువంటి సంఘటనలు కాలక్రమేణా పౌరులు, -ప్రభుత్వాల సంబంధాన్ని పునర్నిర్వచిస్తాయి. అత్యంత ముఖ్యంగా, భారత విద్యా సంక్షోభం ప్రశ్నాపత్రాల లీకులతో మాత్రమే పరిమితం కాదు. పరీక్షల వాయిదాలు, నియామకాల ఆలస్యం, విద్యాసంస్థల్లో ఖాళీలు, ఉన్నత విద్యలో తగిన పెట్టుబడుల కొరత, విద్యా రంగం వాణిజ్యీకరణ- ఇవన్నీ కలిసి విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. విద్యా పరిపాలనలో సమగ్ర సంస్కరణలు లేకుండా పరీక్షా సంస్కరణలు మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించలేవు. భారతదేశానికి అత్యవసరంగా సమగ్ర పరీక్షా సమగ్రత వ్యవస్థ అవసరం. సురక్షితమైన డిజిటల్ మౌలిక వసతులు, స్వతంత్ర పరీక్షా నియంత్రణ సంస్థలు, బలమైన సైబర్ భద్రతా వ్యవస్థలు, నియామక ప్రక్రియల పారదర్శక ఆడిట్లు, పరీక్షా మోసాలపై వేగవంతమైన న్యాయ చర్యలు, సమాచార బహిర్గతం చేసే వ్యక్తులకు రక్షణ, పోటీ పరీక్షలకు దేశవ్యాప్తంగా ఏకరీతి ప్రమాణాలు ఏర్పాటు చేయాలి. అలాగే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులకు మానసిక సలహా, సహాయక వ్యవస్థలను బలోపేతం చేయాలి. చివరికి, ఏ విద్యార్థి ఉద్యమానికైనా నిజమైన విజయాన్ని కేవలం ఒక మంత్రి రాజీనామాతో కొలవలేం. అది శాశ్వతమైన సంస్థాగత సంస్కరణలకు దారితీస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. నిర్మాణాత్మక సంస్కరణలే శాశ్వత మార్పును తీసుకువస్తాయి. ఈ పరిణామాలు విధాన నిర్ణేతలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. విద్య అనేది కేవలం పరిపాలనా రంగం కాదు; అది కోట్లాది భారత యువత కలలు, ఆశయాలు, భవిష్యత్తుకు ప్రతీక. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడం, పాలనలో పారదర్శకత పెంపొందించడంలో, విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కులు రక్షించడం, ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పడం జాతీయ ప్రాధాన్య అంశాలు మారాలి. అప్పుడే భారతదేశం ప్రజల ఆగ్రహాన్ని అర్థవంతమైన విద్యా సంస్కరణలు, ప్రజాస్వామ్య పునరుజ్జీవనంగా మార్చగలదు.

# సాగు దండుగ అన్నోళ్లు మళ్లీ మోపయింద్రు



మేం వద్దంటే పోరాటాలు చేశారు.. మేం వద్దంటే గోదావరి మీద ప్రాజెక్టులు కట్టారు.. మేం వద్దంటే కృష్ణా మీద ప్రాజెక్టులు కట్టారు.. మేం కష్టపడి దశాబ్దాల పాటు ఎప్పటికీ పూర్తి కాకుండా పెండింగ్ లో పడేస్తే.. వాటిని పూర్తి చేసుకున్నారు. మేం వద్దన్నా.. కూడదన్నా వ్యవసాయాన్ని పండుగ చేసుకున్నారు.. మాకంటే దండిగా పంటలు పండిస్తారా? ఎంత అహంభావం? మీరు రైతుబంధు ఇచ్చిన పాపానికి చచ్చినట్టు మేం ఇవ్వాల్సి వచ్చింది. హమ్మా!! మాకే పాఠాలు చెప్పడానికి ప్రయత్నిస్తారా? ఒక విజనరీ విజన్‌నే ప్రశ్నించడానికి దుస్సాహసం చేస్తారా? మీరెట్లా ఉండాలో, ఎలా ఉండాలో, మిమ్మల్ని ఎక్కడ ఉంచాలో మాకు తెలుసు. తిండి తినటం కూడా రాని మిమ్మల్ని పైకి తీసుకువచ్చాం.. అలాంటి మాకు వ్యతిరేకంగా, మా పట్ల కృతజ్ఞత లేకుండా కేసీఆర్ అనే ఒకానొక నాయకుడు మిమ్మల్ని పక్కదారి పట్టించాడు. ఇదీ రాష్ట్ర విభజనకు శత్రువు, ప్రపంచ విజనరీ మనోగతం. తెలంగాణలో సాగు బాగుపడి, ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ బాబు దండుగ అని నిర్లక్ష్యం చేసిన వ్యవసాయాన్ని ప్రత్యేక రాష్ట్రంలో పండుగ చేసుకున్నాం. కానీ ఇప్పుడు కూడా తమ బతుకులపై, భవిష్యత్తుపై, భావితరాలపై దృష్టి పెట్టకుండా తెలంగాణపై పడి ఏడుస్తున్నారు. వాళ్ల మనసులో ఇలా అనుకుంటున్నారని అనిపిస్తున్నది. అప్పుడే చెప్పాం.. ఇష్టం ఉన్నా.. లేకున్నా మాతోనే ఉండాలని హెచ్చరించాం. మమ్మల్ని కాదంటే మీకు రాళ్లూ రప్పలే దిక్కు అని భవిష్యత్తు కూడా చూపించాం. మీకు నీళ్లు రావాలో వద్దో మేం నిర్ణయిస్తాం.

మీరు వ్యవసాయం చేయాలో వద్దో కూడా మేమే చెప్తాం. మీరు వలసలు పోయి బతకడానికే కదా బొంబాయి బస్సులు వేసింది. అక్కడెక్కడికో పోయి బతక్క.. మళ్లా వెనక్కి వస్తారా? రాష్ట్రం సాధించుకొని, బరాజ్‌లు కట్టుకున్నారు.. చెరువులు, చెక్‌డ్యామ్‌లు నింపుకొన్నారు. మేం బయటకు వలసలకు పంపించినోళ్లను తిరిగి వెనక్కి తెప్పించుకున్నారు. అన్నింటికీ మించి మా దగ్గరి నుంచి కూలి పనికి మనుషులు వచ్చేలా చేశారు. ఎంత అహంకారం మీది. అని కుళ్లుకుంటున్నాడు ప్రపంచానికి ఐటీని పరిచయం చేసినట్టు చెప్పుకొనే స్వయం ప్రకటిత మేధావి.


అంతేనా.. మన బతుకులు బాగుపడితే చూడలేని బాబులు, బాబుల శిష్యులు మళ్లీ మన తెలంగాణపై పెత్తనం చెలాయిస్తున్నారు. కొట్లాడి రాష్ట్రం సాధించుకున్న ప్రజలపై కక్ష సాధించేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. పట్టిపీడించడం అంటే ఎలా ఉంటుందో చూపిస్తున్నారు. జనాలను కష్టాల్లోకి నెట్టేసి ఇలా అనుకుంటున్నారు. ఇప్పుడేమైంది.. మీ బతుకులు మా పిడికిట్లో చిక్కుకున్నాయి. ఢిల్లీలో మావోడే ఉన్నడు. నీళ్ల శాఖలో కూడా మావోడినే పెట్టుకున్నం. మీ దగ్గర ఉన్నవాళ్లంతా మా తోలుబొమ్మలు. వారికి మేం ఎంత చెప్తే అంత.. మేం చెప్పకపోతే నోట్లో ముద్ద కూడా పెట్టుకోరు. అంతటి విధేయులు. మీ నీళ్ల శాఖలోనూ మావోళ్లందరినీ చొప్పించాం. భలే ఉన్నది కదా.. మా ఆట. ఇప్పుడు నీళ్ల విషయంలో, ప్రాజెక్టుల విషయంలో ఏం జరుగుతున్నదో కూడా తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా మేం నడిపిస్తున్న డ్రామాను చూస్తూ ఉండండి. గోదావరి మీద మీరు కట్టుకున్న ప్రతీ ప్రాజెక్టు అనుమతినీ రద్దు చేపిస్తాం. కృష్ణా మీద ఒక్క ప్రాజెక్టు కూడా కట్టకుండ చేస్తం. మీకు నీళ్లు ఎట్లా వస్తయో చూస్తం. ఒక్క చుక్క కూడా రాకుండా చేస్తం. ఎవరన్నా అడిగితే.. పాపం గడ్డమీదున్నరు.. వాళ్లకు నీళ్లెట్ల వస్తయి అని సన్నాయి నొక్కులు కూడా నొక్కుతాం. నీళ్లు లేవు.. వ్యవసాయం లేదు.. మీకేదీ అక్కరలేదు. నోరుమూసుకుని పడి ఉండండి.. మేం చెప్పినట్టు నడుచుకోండి.. మీకు నీళ్లు అవసరం లేదు.

వ్యవసాయం వద్దు. వలసలు మీకు ఇంతకుముందే అలవాటు చేశాం కదా.. కొత్తేమీ కాదు.. కావాలంటే మావోళ్లకు చెప్పి నాలుగు బస్సులు, రైళ్లు వేయిస్తాం పొండి. మళ్లీ తిరిగి వచ్చారా తస్మాత్ జాగ్రత్త! తిండి కావాలంటే నాలుగు మెతుకులు పడేస్తాం.. తినండి. నూకలు తిని బతకండని మావోడు ఢిల్లీలోనే చెప్పాడు కదా.. అప్పుడే మర్చిపోయారా? ఎప్పుడన్నా వానలు పడితే.. ఏమన్నా పండించుకోండి. అంతేకానీ, ప్రాజెక్టులు, నీళ్లు, వ్యవసాయం అని అన్నారో.. మా తడాఖా చూపిస్తాం. ఇట్లాంటి బాబులను, బాబులకు ఊడిగం చేసే బానిసల గుట్టుమట్టు తెలుసుకొని మసలుకోవాల్సి ఉన్నది. అదనుచూసి ఓటు అనే కర్రుకాల్చి వాతపెట్టాల్సిన చైతన్యం ప్రదర్శించాల్సి ఉన్నది.

# కాక్రోచ్‌లు సంఘటితమవ్వాలి

నమ్మశక్యం కాని విషయాలు అప్పుడప్పుడు వాస్తవాలుగా పరిణమించడం భారతదేశ విలక్షణత. తమ చుట్టూ ఉన్న సమాజాన్ని మార్చివేయాలని అనునిత్యం అనేకానేక మంది ఆకాంక్షిస్తుంటారు. స్వప్న సాధకులు ఎంతమంది? అరుదు, చాలా అరుదు. కనుకనే ఉద్యమ భారతంలో 30 ఏళ్ల యువకుడు అభిజిత్ దీప్కే సాఫల్యాన్ని ఒక అసాధారణ విజయంగా మనం భావించి తీరాలి.

'కాక్రోచ్‌లు సంఘటితమవ్వాలి' అని మే 16న విజ్ఞప్తి చేసిన ఒక ట్వీట్ దేశవ్యాప్తంగా యువజనుల నిరసనోద్యమంగా ప్రజ్వరిల్లి అంతిమంగా ఒక కేంద్రమంత్రి రాజీనామాకు దారితీస్తుందని ఎవరు ఊహించారు? ఈ దేశంలో, నెల రోజుల క్రితం దీప్కే గురించి విన్నవారు ఎంతమంది? ఆయన ఏర్పాటు చేసిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)ని పట్టించుకున్నవారెంతమంది? మరి నేడు శంభాజీనగర్‌లోని దీప్కే నివాసం ఎదుట వందలాది టీవీ చానెళ్ల రిపోర్టర్లు, యూట్యూబర్లు, సీనియర్ రాజకీయ నాయకులు బారులు తీరుతున్నారు. ఆన్‌లైన్ ఫ్యాడ్‌గా అనేకమంది కొట్టిపారేసిన ఉదంతమే అనూహ్యంగా ఈ ఏడాది అతిపెద్ద రాజకీయ సంఘటనగా నిలిచింది. ఉద్యమ తక్షణ లక్ష్యం నెరవేరింది. అసలు సవాల్ ఇప్పుడే మొదలయింది. కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే స్వతంత్ర బృందం (ప్రెజర్ గ్రూప్)గా ఉండిపోతుందా? లేక, ఎన్నికల రాజకీయాలలోకి దూకుతుందా? ఈ విషయమై దీప్కేను ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ప్రశ్నించాను (సామాజిక మాధ్యమాలలో అనేకమంది సైతం ఇదే ప్రశ్న అడుగుతున్నారు).. నా ప్రశ్నకు దీప్కే వెన్వెంటనే ఇలా సమాధానమిచ్చారు: 'సీజేపీని ఒక రాజకీయపార్టీగా మార్చే విషయం గురించి మేము ఆలోచించనే లేదు. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే నిరసనోద్యమంగా మాత్రమే ఉండిపోవాలని మేము భావిస్తున్నాము'. ఇటువంటి మాటలనే ఇండియా ఇంతకు ముందూ విన్నది. 2011లో అవినీతి నిర్మూలనోద్యమం ఉధృతంగా కొనసాగుతున్నప్పుడు రాజకీయాలలోకి ప్రవేశించే ఉద్దేశం తనకు ఎంతమాత్రం లేదని అరవింద్ కేజ్రీవాల్ పదే పదే ఉద్ఘాటించారు. రెండు సంవత్సరాల అనంతరం ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించింది ఆయనే కాదూ? విజయవంతమైన ప్రతి నిరసనోద్యమమూ అంతిమంగా ఒకే విధమైన సందిగ్ధావస్థ నెదుర్కోవటం కద్దు: నైతిక పలుకుబడిని రాజకీయ అధికారంగా మార్చుకోవడం ఎలా? ఈ సంకట పరిస్థితిని చాలా మంది కంటే దీప్కే మెరుగ్గా అర్థం చేసుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీతో పనిచేసిన అనుభవం దీప్కేకు ఉన్నది. ప్రజాగ్రహాన్ని ఎన్నికల విజయంగా ఎలా మార్చుకోవచ్చో ఆప్ నిరూపించింది. ఉద్యమ సాఫల్యంతో సమకూరిన నైతిక అధికారాన్ని, పోటీ రాజకీయాలలోకి ప్రవేశించిన తరువాత నిలబెట్టుకోవడం ఎంత కష్టమో అన్నదానికి కూడా ఆ పార్టీ ఒక దృష్టాంతం అయింది. ఎన్నికల రాజకీయాలలోకి దిగిన తరువాత పొత్తులు, రాజీలు, సంస్థాగత ఒత్తిళ్లు అనివార్యం కదా. వ్యవస్థపై ప్రజాగ్రహం మాత్రమే కాకుండా మరెన్నో అంశాలు కలిసివస్తేనే మౌలిక రాజకీయ మార్పును సాధించడం సాధ్యమవుతుంది. చరిత్ర సూచిస్తున్న సత్యమిది. సరైన సమయంలో సరైన నాయకుడు రంగంలో ఉండడం చాలా ముఖ్యం. అంతకంటే ముఖ్యంగా అతడి ప్రాభవ ప్రాబల్యాలకు ఒక స్పష్టమైన సామాజిక మద్దతు ఉండి తీరాలి. కేజ్రీవాల్ కేవలం అవినీతి నిర్మూలనోద్యమం ఆధారంగా ఢిల్లీ అధికారాన్ని కైవసం చేసుకోలేదు. అంతకంతకూ విస్తరిస్తోన్న పట్టణ మధ్యతరగతి వర్గానికి ఆయన రాజకీయ గొంతుక అయ్యారు. ఆ విస్తృత సామాజికవర్గం ఆలంబనతోనే కేజ్రీవాల్ తన అధికారోన్నతికి సోపానాలు నిర్మించుకున్నారు. తమిళనాడులో ఈ ఏడాది అసాధారణ రాజకీయ విజయం సాధించిన జోసెఫ్ విజయ్ కథ కూడా విశిష్టమైనది. సినీనటుడు అయిన విజయ్, తమిళ సమాజానికి విలక్షణమైన సినిమా సంస్కృతి, రాజకీయాలను కలగలిపి అద్భుత విజయాన్ని అందుకున్నారు. ద్రావిడ పార్టీల దశాబ్దాల ప్రాబల్యాన్ని ఎదుర్కొనేందుకు ఆయన ప్రధానంగా యువతరంపై ఆధారపడ్డారు. సంప్రదాయ కుల, వర్గ అంతరాలకు అతీతంగా యువ ఓటర్లు విజయ్ పట్ల ఆకర్షితులయ్యారు. ఆయనకు అద్వితీయ విజయాన్ని అందించారు. ప్రజల ధర్మాగ్రహం ఒక ఉద్యమాన్ని ప్రజ్వలింప జేయవచ్చు. అయితే అది అరుదుగా మాత్రమే ఎన్నికల సవాళ్లను సమర్థంగా ఎదుర్కోగలుగుతుంది. కాక్రోచ్ జనతా పార్టీ కీలక మద్దతుదారులు ఎవరు? ప్రశ్న పత్రాల లీక్‌లపై ఆగ్రహిస్తోన్న జెన్ జీ విద్యార్థులా? ఉద్యోగాన్వేషణలో వేసారుతున్న నిరుద్యోగ పట్టభద్రులా? భారత్ అనుపమానంగా సాధిస్తున్న అభివృద్ధిలో తమకు సముచిత రీతిలో వాటా లభించడం లేదని ఆగ్రహిస్తున్న దిగువ మధ్యతరగతి ప్రజలా? కొత్త రాజకీయ వ్యూహాలకు ప్రయత్నిస్తున్న అంబేడ్కర్ వాదులా? అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడంలేదని ఆగ్రహిస్తున్న ముప్పై ఏళ్ల లోపు వయసు ఉన్న నవ యువతరమా? ఈ ప్రశ్నలకు సమాధానం లభించనంతవరకు ఏ నిరసనోద్యమాన్ని అయినా సరే ఒక ఎన్నికల శక్తిగా మార్చడమనేది చాలా కష్టసాధ్యమవుతుంది. సీజేపీ విషయంలో మరో కారణం కూడా ఉన్నది. 2013లో ఢిల్లీలో, 2026లో తమిళనాడులో ఉన్న రాజకీయ పరిస్థితులకు నేటి జాతీయ రాజకీయ దృశ్యం పూర్తిగా భిన్నమైనది. ఇప్పుడు భారతీయ జనతా పార్టీ భారత దేశ ప్రధాన ఎన్నికల శక్తిగా వర్ధిల్లుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీర్తి చంద్రికలు కించిత్ మసకబారి ఉండవచ్చు గానీ ఆయన ఇప్పటికీ శిఖర సమానుడు. ఒక అజేయశక్తిగా వెలుగొందుతున్నారు. కేంద్ర కేబినెట్ మంత్రి రాజీనామాను అనివార్యం చేయడం విశిష్ట రాజకీయ విజయమే, సందేహం లేదు. అయితే మహాశక్తిమంతమైన బీజేపీ ఎన్నికల యంత్రాంగాన్ని ఓడించడం పూర్తిగా భిన్నమైన విషయం. అదంత తేలికైన వ్యవహారం కాదు. నిజానికి సీజేపీ బలం, ప్రభావశీలత అంతా కచ్చితంగా అది మరొక రాజకీయ పార్టీ కాకపోవడంలోనే ఉన్నది. సీజేపీ నిర్వహించిన జంతర్ మంతర్ ఆందోళన భారతీయ యువజనులను చైతన్యపరచడమే కాదు, సమస్త భారతీయుల మనసులపై చెరగని ముద్ర వేసింది. సంప్రదాయ పక్షపాత రాజకీయాలకు అతీతంగా ఒక విశాల ఆదర్శాన్ని అది ఆలంబనగా చేసుకున్నది. వ్యవస్థ పట్ల తమ అసంతృప్తిని, ఆగ్రహావేశాలను వ్యక్తం చేసేందుకు యువజనులకు అది ఒక వేదికను సమకూర్చింది. నీట్ ప్రశ్నపత్రాల లీక్ అందుకు తక్షణ ప్రేరణ అయినప్పటికీ తగ్గిపోతున్న అవకాశాలు, పెరుగుతున్న అసమానతలు, సామాన్య ప్రజల సమస్యల పట్ల ప్రభుత్వాల ప్రతిస్పందనా రాహిత్యం మొదలైన వాటి పట్ల యువజనులలో లోతుగా గూడుకట్టుకున్న ఆవేదనలు, ఆందోళనల కారణంగానే సీజేపీ ఉద్యమం విస్తృతంగా ప్రతిధ్వనించింది, ప్రజల మద్దతును పొందింది. నైతిక పలుకుబడి చాలా విలువైనది. దానిని ఒకసారి కోల్పోతే తిరిగి పొందడమనేది అరుదుగా మాత్రమే సాధ్యమవుతుంది. ఒక ఉద్యమం ఎన్నికల రాజకీయాలలోకి ప్రవేశించిన క్షణమే ప్రతి నిర్ణయమూ ఏదో ఒక రీతిలో రాజీపడి తీసుకున్నదే అవుతుంది. ఉద్యమకారుడు క్రమంగా, తాను ఒకప్పుడు సవాల్ చేసిన వ్యవస్థలోనే భాగస్వామి అవుతాడు. బహుశా ఈ కారణంగానే సీజేపీ సదా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే స్వతంత్ర బృందంగా ఉండిపోవాలన్నది అభిజిత్ దీప్కే స్వాభావిక వైఖరిగా ఉన్నది. ఇది, కనీసం ప్రస్తుతానికి వివేకవంతమైన మార్గం. ఉద్యమించవలసిన సమస్యలా?-- నిరుద్యోగం, ప్రశ్న పత్రాల లీక్, విఫలమవుతున్న ప్రభుత్వ విద్యా వ్యవస్థలు, పోలీసు సంస్కరణలు, పర్యావరణ విధ్వంసం, వ్యవసాయరంగంలో నిత్య సంక్షోభం, బడుగు, బలహీన వర్గాల జీవన అవస్థలు... మొదలైనవి అనంతంగా ఉన్నాయి. ఈ సమస్యలను జరూరుగా పరిష్కరించవలసి ఉన్నదన్న విషయమై అన్ని పార్టీల మధ్య ఏకీభావం ఉన్నది. కనుక సీజేపీ ఈ సమస్యలపై ఉద్యమించాలి. ఏదో ఒక రాజకీయ పక్షం తరఫున లేదా భావజాలానికి అనుగుణంగా వ్యవహరించడానికి బదులుగా ఆ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి ప్రభుత్వమూ పూచీ వహించేలా సీజేపీ తన స్వతంత్ర గళాన్ని వినిపించాలి. ఎన్నికల రాజకీయాలలోకి ప్రవేశించాలనే ఆకాంక్ష సహజంగానే అంతరించదు. లక్ష్య సాధనలో సఫలమైన ప్రతి ఉద్యమమూ అంతిమంగా ఆ ఆకాంక్షను నెరవేర్చుకోవడానికి తపన పడుతుంది. అయితే చరిత్ర మరొక పాఠాన్ని నేర్పడం కూడా ఖాయం. రాజకీయాలలో మార్పు సాధించేందుకు ప్రతి ఉద్యమమూ ఒక రాజకీయ పార్టీగా పరిణమించవలసిన అవసరం లేదు. పార్లమెంటులో అధికారపక్షంగా వెలుగొందడానికి బదులుగా జాతీయ సంభాషణను ప్రగాఢంగా ప్రభావితం చేయడం ద్వారా కొంతమంది ప్రజా జీవితంపై చెరిగిపోని ముద్ర వేశారు. మహోన్నతుడైన బాబా సాహెబ్ అంబేద్కర్ సైతం ఎల్లవేళలా ఎన్నికల్లో విజయం పొందలేకపోయారు. అయితే సామాజిక న్యాయం లక్ష్య సాధనకు నిబద్ధమైన అంబేద్కరిజం మరే భావజాలం కంటే కూడా భారతీయ రాజకీయాలను మౌలికంగా తీర్చిదిద్దింది. కొద్దిమంది సాధ్యమని ఊహించిన దానికంటే చాలా ఎక్కువ మార్పునే కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పటికే సాధించింది. డిజిటల్ వేదికల ద్వారా సంఘటితమైన యువ భారతీయులు అధికారంలో ఉన్నవారు తమ మాటను విని తీరేలా చేయగలరనే విషయాన్ని సీజేపీ ఉద్యమం సందేహాతీతంగా రుజువు చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ మరొక రాజకీయ పక్షంగా పరిణమిస్తుందా లేదా అనేది ఇప్పుడు దాదాపు ఒక అప్రస్తుత ఆలోచన. లక్షలాది యువ భారతీయులను అపూర్వ రీతిలో సంఘటితపరిచిన సీజేపీ విశ్వసనీయత, స్వతంత్రత, నిక్కమైన ఉద్యమ నిబద్ధతను కాపాడి నిలబెట్టడమే దాని వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు అసలైన పరీక్ష. ఒక పోరాటంలో విజయం సాధించడమనేది మొత్తం యుద్ధంలో గెలవడం ఎంతమాత్రం కానేకాదు. కాక్రోచ్‌ల పోరాట ప్రస్థానంలో మొదటి అధ్యాయం ముగిసింది. మరింత క్లిష్టమైన, కఠినమైన కొత్త అధ్యాయం ఇప్పుడే ఆరంభమయింది.



# మృతుని కుటుంబానికి ఉపాధ్యాయుల బృందం చేయూత

- రోడ్డు ప్రమాద మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**చేయూతనిచ్చిన ఉపాధ్యాయ బృందానికి స్థానికుల అభినందన**

**అగ్నిధార న్యూస్ రామగిరి/మంథని :**



కల్వచర్ల గ్రామస్తుడైన మైలగాని కిరణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. ప్రభుత్వ పాఠశాలకు వెనుక వైపునే వారి సొంత ఇల్లు ఉండేది. ప్రభుత్వ పాఠశాల పట్ల ప్రత్యేక అభిమానం కలిగిన కిరణ్ అకాల మరణం పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కల్వచర్ల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కిరణ్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సహాయంగా రూ.14,500/- లను కీ.శే. కిరణ్ భార్య మైలగాని అనూషకి చెక్కు రూపేణా అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.ప.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు దేవళ్ల వనజ, గంట్ల రమాదేవి, ఆవిడపు రవి, కే.సత్యవతి, గుండేటి సత్యనారాయణ, గసిగంటి దేవేందర్, కే.శ్రీలత, మల్లారపు శంకర్, కే.సతీష్, ఎం.పి.పి.ఎస్ ప్రధానోపాధ్యాయులు ఆకుల శ్రీనివాస్, కే.వేణుగోపాల్, పి.కిష్టయ్య, ఎల్.పద్మావతి, దివ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. కష్ట సమయంలో ఒక కుటుంబానికి చేయూతనిచ్చిన ఉపాధ్యాయులను స్థానికులు అభినందించారు.

# ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి

**అగ్నిధార న్యూస్‌మహమ్మదాబాద్:**




మండలంలోని ఎరువుల దుకాణాల తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి అనధికార ఎరువుల అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో భాగంగా డిఏపి, యూరియాతో పాటు ఇతర ఎరువుల స్టాక్ పూర్తిగా పరిశీలించడం జరిగింది. బస్తాలపై బ్యాచ్ నెం, తయారీ, డిస్ట్రిబ్యూటర్ల నుండి వచ్చిన ఇన్వాయిస్‌లు స్టాక్‌తో సరిపోలుతున్నాయా లేదా అని చూడడం జరిగింది. నకిలీ డిఏపి లేదా ఇతర అనధికార ఎరువుల విక్రయం చేసినట్లు తేలితే వెంటనే లైసెన్స్ రద్దు చేసి, స్టాక్ సీజ్ చేసి, ఈ సీ. ఏ సి టీ 1955 కింద క్రిమినల్ కేసు నమోదు చేయబడును అని, అదే విధంగా ప్రతి అమ్మకానికి పోస్ మిషన్ ద్వారా బిల్లు ఇవ్వాలని అన్నారు. ఇన్వాయిస్ లేని స్టాక్ దుకాణంలో ఉంచరాదు. డిస్ట్రిబ్యూటర్ ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్, అమ్మకాల రిజిస్టర్ ఎప్పుడూ అప్‌డేట్ చేసి ఉంచాలి. ఎంఆర్ పి కంటే ఎక్కువ వసూలు చేయరాదు. రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలి. అనుమానాస్పద ఎరువు కనిపిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారులకి సమాచారం ఇవ్వాలి. రైతులు కూడా ఎరువులు కొనేటప్పుడు బిల్లు, బ్యాచ్ నెం, కంపెనీ పేరు తప్పనిసరిగా చూడాలని సూచించారు. అదే విధంగా ఎరువుల అమ్మకాలపై అన్ని ఎరువుల దుకాణాల డీలర్లకు నోటీస్లు జారీ చేశారు.

## ఎస్సైశేఖర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన యువత



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ ఐ శేఖర్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి శాలువాలతో సత్కరించారు మండల యువ నాయకులు బర్త్డే వేడుకలను ఘనంగా నిర్వహించారు వారు మాట్లాడుతూ,యువకులకు ఆదర్శప్రాయుడు, నిగర్వి, సౌమ్యుడు, విద్యావేత్త, మొఖంపై ఎప్పుడు చిరునవ్వు కురిపిస్తూ,ఆపదలో ఉన్న వారికి అండగా నేనున్నానంటూ ధైర్యం కల్పించే యువ కిశోరం ఎస్ ఐ శేఖర్ అంటూ వారి గొప్పతనాన్ని కొనియాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగిన ఒదిగి ఉండడమే ఆయన నైజం.. కలం పట్టి చదువు నేర్పిన ఉపాధ్యాయుడే నేడు గన్ను పట్టి శాంతిభద్రతలను కాపాడుతున్నాడు వారి గురించి ఎంత చెప్పినా తక్కువే అంటూ సెల్యూట్ సర్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన స్థానాలను పొందాలని ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు సురేష్, కిరణ్, రమేష్,పంత్,నరేందర్,పంత్, తదితరులు పాల్గొన్నారు.

## 7వ కుబేర సహాయక సర్వసభ్య సమావేశానికి విశేష స్పందన

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలోని స్థానిక భాజపా కార్యాలయంలో కుబేర పరస్పర సహాయక పొదుపు పరపతి సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశం నందు 2025-26 ఆడిట్ రిపోర్ట్ ఆమోదించడం, పొదుపు చేయు సభ్యులను పెంచడానికి తీర్మానం చేశారు అదే విధంగా పదవీ పూర్తి అయిన 4 గురి స్థానం లో నూతన పాలక వర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ముఖ్య వక్తగా ఎడ్మ మాధవరెడ్డి మాట్లాడుతూ, సభ్యులకు పొదుపు ప్రాముఖ్యతను వివరించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సహకార భారతి తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముక్ కుడుముల పాండు రంగారెడ్డి, సహకార భారతి తెలంగాణ ప్రాంత క్రెడిట్ సొసైటీస్ సెల్ ఇంచార్జ్ రోళ్ల బాలరాజు అధ్యక్షులు గోవిందు పర్వతాలు, కార్యదర్శి మురళీదర్ రెడ్డి మస్న. సత్యం, పి. దామోదర్ రెడ్డి రమాదేవి వెంకటమ్మ సంతోష్ కరుణాకర్ రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## నంచర్లలో పండుగ సాయన్న జయంతి ఘనంగా నిర్వహించారు

**అగ్నిధార న్యూస్‌మహమ్మదాబాద్:**

మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు గ్రామ పెద్దలు మాట్లాడుతూ భూస్వాములు, దొరల అరాచకాలను ఎదిరించి పేదల ఆకలి తీర్చిన రాబిన్ హుడ్ పండుగ సాయన్న అని గుర్తుంచుకున్నారు పండుగ సాయన్న భూస్వాములను దోచి పేద ప్రజల ఆకలి తీర్చిన గొప్ప వ్యక్తి పండుగ సాయన్న పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రాబిన్ హుడ్ పండుగ సాయన్న అని కొనియాడారు అదేవిధంగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముదిరాజులు వనమాల శ్రీనివాస్, ఎస్ సువర్ణ, మాధవులు, జి లక్ష్మణ్, బి హనుమంతు, బెస్త చిన్నయ్య, ఎం వెంకట్ రాములు, ఎం కొండయ్య, జి వెంకటేష్, ఎం గోపాల్,గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, గాండ్ల పార్వతయ్య, సాయి రెడ్డి, తిరుమల్ రెడ్డి, బి రాజు, ముద్దిరాజు సోదరులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## జెడ్పీహెచ్ఎస్ లో ఘనంగా ముందస్తు బోనాల జాతర ఉత్సవాలు



**అగ్నిధార న్యూస్ మంథని :**

మంథని మండలం ఎగ్లాస్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) లో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు బోనాల జాతర ఉత్సవాలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బోనాల పండుగ ఉత్సవాలను పాఠశాలలో నిర్వహించడం జరిగిందని ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి పేర్కొన్నారు. బోనాలతో పాటు పోతరాజుల వేషధారణలో విద్యార్థులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్, ఎస్ఎంసి కమిటీ అధ్యక్షులు స్వరూప, పాఠశాల సిబ్బంది సంతోష్ కుమార్, శ్రీనివాస్, రాజశేఖర్, మంజుల, జ్యోతి, అనిత, ఎం రాజశేఖర్, దొమ్మటి రవి, ధనంజయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఘనంగా స్కూల్ క్యాబినెట్ ఎన్నికలు

**కరీంనగర్** : పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ సీబీఎస్‌ఈ పాఠశాలలో శనివారం స్కూల్ క్యాబినెట్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటు క్రీడలు, క్రమశిక్షణ, సాంస్కృతిక విభాగాల లీడర్లు, డిప్యూటీ లీడర్లను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇ-బ్యాలెట్ విధానంలో ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులే బూత్, ఎన్నికల, ప్రిసైడింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వహించడం విశేషం. ముఖ్య అతిథులుగా ఏసీపీ తంగేళ్ల ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సుగాటి కోటేశ్వర్ రావు, విద్యాసంస్థల అధినేత డా. ఇ. ప్రసాద్ రావు హాజరై విద్యార్థులకు నాయకత్వం, బాధ్యత, క్రమశిక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

## చినుకు పడితే చిత్తడే...



**మంథనిలో వర్షానికి చెరువు లా మారిన రోడ్లు**

**గుంతలతో ప్రజల అవస్థలు**

**అగ్నిధార న్యూస్ మంథని :**

మంథని పట్టణంలో కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. చినుకు పడితే చాలు రోడ్లు మొత్తం నీటితో నిండి చిత్తడిగా మారుతున్నాయి.పట్టణంలోని శ్రీపాద చౌక్ సమీపంలోని కూరగాయల మార్కెట్ , బోయిన్ పేట్ మరియు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో ఆ రహదారి చెరువును తలపిస్తోంది.గుంతల్లో నీరు నిలవడంతో రోడ్డు ఎక్కడ ఉందో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహన దారులు ప్రాణాలకు తెగించి ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు వర్షం పడితే ఈ రోడ్డు మీద నడవడానికే భయంగా ఉందనీ, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## మార్గదర్శి స్కూల్ లోఆషాఢమాస బోనాల జాతర



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని ఆగస్టు8:**

స్థానిక 5ఇంక్లైన్ ఏరియాలోని మార్గదర్శి హైస్కూల్లో పాఠశాల హెచ్ఎం లక్కాకుల రవి ఆధ్వర్యంలో శనివారం ఆషాఢమాస బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సంప్రదాయ వేషధారణలతో హాజరై ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. దీంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసేలా బోనాల వేడుకలను నిర్వహించారు.కార్యక్రమంలో డైరెక్టర్ జమునారాణి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పద్మ, సౌజన్య, రమ,రమేష్, ఎల్లయ్య, పోషకులు విద్యార్థిని విద్యార్థులకు పాల్గొన్నారు.

## శ్రీవాణి పాఠశాలలో బోనాల సంబరాలు.

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని /8ఇంక్లైన్ కాలనీ ఆగస్ట్ :08**

శనివారం రోజున శ్రీవాణి పాఠశాల లో బోనాల పండుగ వేడుకలను పాఠశాల ఆవరణంలో నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్కూల్ కరస్పాండెంట్ జి.లక్ష్మణ్ కుమార్, 16వ డివిజన్ కార్పొరేటర్ రమ కిషన్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్, 8వకాలనీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జి. రవీందర్ హాజరై అతిథులు మాట్లాడుతూ..

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింభించేలా విద్యార్థులు అమ్మవారు, పోతరాజు వేషాధారణ లతో తమ అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు,పండుగలయొక్క విశిష్టతను చిన్నారులకు పరిచయం చేస్తూ మన వారసత్వం పట్ల వారిలో గౌరవాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు, ఈ కార్యక్రమంలో శివశక్తులు ప్రియాంక బోనాల ఆటతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలోఆకుల కుమార్,ప్రిన్సిపల్ జి. మానస,అశోక్,శారదా,ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన కందుల సంధ్యారాణి.



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని ఆగస్టు 8**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు తాడిచర్ల బ్లాక్-2 మరియు పీకే ఓ సి-2 డీప్‌సైడ్ కోల్ బ్లాక్ కేటాయించడంపై బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు సంస్థ భవిష్యత్ విస్తరణకు, ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు, పెద్దపల్లి ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు.సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడానికి, ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఈనిర్ణయంఉపయోగపడుతుందని కందుల సంధ్యారాణి తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి నీ శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణ సంస్కృతి.. బోనాల పండుగ వేడుకలు

**కమాన్ పూర్** : తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన సంప్రదాయ పండుగ బోనాలు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పండుగను లిటిల్ మాస్టర్స్ స్కూల్ ? రొంపికుంటలో ఘనంగా నిర్వహించడం జరిగింది.

# ఆగస్టు 10 న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సిఐటియు జిల్లా నాయకులు బండపల్లి శివరాములు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు కూలీ వ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా స్ఫూర్తితో కేంద్ర కార్మిక రైతు కూలీ సంఘాలు దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆగస్టు 10న కల్వకుర్తిలో జరుగు జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు బండపల్లి శివరాములు కార్మికులకు రైతులకు కూలీలకు విజ్ఞప్తి చేశారు ఆయన శనివారం వంగూరు మండలంలో నీ ఉల్పర కోనాపూర్ రంగాపూర్ గ్రామాలలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు జైల్ భరో కరపత్రాన్ని కార్మికులు రైతు కూలీలతో కలిసి విడుదల చేశారు అనంతరం శివరాములు మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందు ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను 2025 నవంబర్ లో పార్లమెంటులో ఆమోదించి కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు లేబర్ కోడ్ లలో యజమానులకు అనుకూలంగా చట్టాలను చేసి కార్మికుల జీవితాలతో చెలగాట మారుతుందని అన్నారు స్కీం వర్కర్ గా పనిచేస్తున్న ఆశా అంగన్వాడి ఐకెపి వివో ఏ ఫీల్డ్ అసిస్టెంట్ మధ్యాహ్న భోజన గ్రామపంచాయతీ తదితర రంగాల కార్మికులు సంవత్సరాల తరబడి సంవత్సరాల తరబడి కనీస వేతనాలు అమలు చేయాలని అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెవిటోడి ముందు శంఖం ఊదినట్లు ఉన్నదని ఆయన ఎద్దేవా చేశారు పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని అన్నారు అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ హమాలి ఆటో తదితరు రంగాల కార్మికులకు రక్షణ కరువైందని అన్నారు రాష్ట్రాల ప్రజల ఉన్న విద్యుత్తును కేంద్రం ఆధీనంలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వాలపై భారాలు మోపుతుందని అన్నారు అమెరికా అడుగులకు మడుగులోకి విదేశాలలో ఉత్పత్తి అయిన సరుకులను దేశంలోనికి ఎలాంటి సుంకాలు విధించకుండా స్వేచ్ఛ వ్యాపారానికి ద్వారాలు తెరిచిందని అన్నారు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా ఎరువుల ధరలు విపరీతంగా పెంచిందని ఉన్నారు 2005లో వామపక్షాల ఒత్తిడితో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు గ్రామాలలో పని కల్పించడానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొస్తే ఆ చట్టాన్ని రద్దుచేసి విబిజీ రాంజీ బిల్లును తీసుకొచ్చి కూలీల పొట్టలు కొడుతుందని అన్నారు రోజుకు 600 రూపాయల కూలి ఇవ్వాలని రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మికులు కూలీలు రైతుల సమస్య లను ఆయన డిమాండ్ చేశారు ఆగస్టు 10న జరిగే జైలు బరో కార్యక్రమంలో రైతులు కార్మికులు కూలీలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం యొక్క కళ్ళు తెరిపించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు చింత భీమ్ రాజ్ సత్యనారాయణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల సహాయ కార్యదర్శి లక్ష్మణ్ రేణుక మండల నాయకులు అజీమ్ రైతులు మర్రిపల్లి రామస్వామి గాలయ్య మల్లయ్య హమాలి సంఘం నాయకులు శ్రీశైలం బాలస్వామి ఆటో సంఘం నాయకులు చంద్రమౌళి రాము బాలమణి అలివేల లక్ష్మణ్ నాయక్ ఆయా గ్రామాల రైతులు కూలీలు గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కొండోజు అశోక్ చారి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన కొండోజు అశోక్ చారి బాధ్యతలు స్వీకరించారు. సంస్థ జాతీయ చైర్మన్ నందన్ నరసింహ రావు ఆదేశాల మేరకు అశోక్ చారిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా అశోక్ చారికి తుర్కలపల్లి గ్రామస్తులు, పలువురు సామాజిక, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘనలకు గురవుతున్న బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా కృషి చేయడంతో పాటు, ప్రజలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలలు, పేదలు, అణగారిన వర్గాలు, నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంస్థ తరఫున చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అశోక్ చారి నాయకత్వంలో హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం కావాలని, ప్రతి జిల్లాలో సంస్థ కార్యకలాపాలను విస్తరించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. బాధితులకు న్యాయం అందించడం, ప్రజాస్వామ్య విలువలు, మానవ హక్కులు, సామాజిక సమానత్వం కోసం నిరంతరం పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా అశోక్ చారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ చైర్మన్ నందన్ నరసింహ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థను మరింత విస్తరించి ప్రజలకు సేవలందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## నియోజక వర్గ అబివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



బాధితులకు ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి నియోజక వర్గంలో నీ వివిధ మండలాలకు చెందిన అనారోగ్యంతో ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తున్న లబ్ధిదారులకు హైదరాబాద్‌లోని తమ నివాసంలో మండలాలకు చెందిన ముఖ్య నాయకుల సమక్షంలో లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులు మరియు ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ,లబ్ధిదారుల సంక్షేమం, ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం వెల్దండ మండలం లోని అజిలాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన గ్రామ సర్పంచి రమేష్ గౌడ్ తమ వార్డు సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసి గ్రామ అభివృద్ధికి తోడ్పాటునందించాలని వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో,కల్వకుర్తి మాజీ జెడ్పీటీసీ అశోక్ రెడ్డి,మాడుగుల మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు హరీష్ రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

# వర్ష కాలం సందర్భంగా ఇంటి అవరణలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఐక్యత ఫౌండేషన్ సహకారం తో తాగునీటి నాణ్యతకు చర్యలు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



తలకొండపల్లి మండలంలోని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తలకొండపల్లి మండలంలోనీ మదాయ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను ప్రత్యేక పద్ధతిలో శుభ్రపరిచారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మదాయి పల్లి గ్రామ సర్పంచ్ గుల్ల సుధాకర్, గ్రామ ఉప ఆంజనేయులు,గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వర్ష కాలం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు.ప్రతి ఒక్కరూ గ్రామంలోని తాగునీటి నిల్వ ట్యాంకును ఆధునిక జర్మన్ టెక్నాలజీతో పూర్తిస్థాయిలో శుభ్రపరచడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో ఆయనకు మా సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ఐక్యత ఫౌండేషన్‌ను చైర్మన్ సుశీకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుపతి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మండల అధ్యక్షుడు



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఫైనాన్స్ కమీషన్ సభ్యులు అసిఫ్ అలీ,తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్ , ఈ సందర్భంగా తిరుపతి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో మరింతగా రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని తిరుపతి రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన గండి కోట లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది . విషయం తెలుసుకున్న సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ,ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ,మాజీ సర్పంచ్ సునీత వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కడల సంతోష మల్లేష్, వార్డు సభ్యులు వట్టేపు కిషోర్,కాలనీ వాసులు మోటపురం శీను , కుమ్మగొని మహేష్ గౌడ్ , మధు , సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలం, అంతారం గ్రామానికి చెందిన ఎనుముల మల్లయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 4,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రాములు గౌడ్, భాగం మహేష్, అసిఫ్, భవాని, బాలయ్య, బైరపాక ఎల్లయ్య, ఇంద్రకంటి సాయిలు గౌడ్, ఎం.డి. ఇస్మాయిల్, బుడ్డ మహేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలం మాదాయపల్లి గ్రామానికి చెందిన గన్నోజి సుగుణమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 3 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూళ్ళ సుధాకర్, వార్డు సభ్యులు ప్రమీల సత్యం గౌడ్, మహేశ్వరి నిరంజన్, సత్యనారాయణ, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, నాయకులు ముదిగొండ పరంజ్యోతి, గుళ్ళ శేఖర్, బయ్య రామస్వామి, రమేష్, వీర చారి, కొమ్మగోని శేఖర్, మదిగట్ల భగవాన్, శివ చారి, తుడుం శ్రీశైలం గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అడవి కుందేలను వేటాడిని నలుగురు అరెస్ట్

### నిందితుల ఇంట్లో సోదాలు.. మృత కుందేలు స్వాధీనం

**తాండూర్ :** అడవి కుందేలును వేటాడిని ఘటనపై అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. తాండూర్ మండలం తంగళ్లపల్లి గ్రామంలో అందిన సమాచారం మేరకు మండిగ శ్రీకాంత్ ఇంట్లో అటవీ అధికారులు సోదాలు నిర్వహించగా మృతిచెందిన అడవి కుందేలు లభ్యమైంది.అనంతరం శ్రీకాంత్ను విచారించగా.. కొత్తపల్లి గ్రామంలో టెకం రమేష్, బండి కార్తీక్, దూల రాకేష్తో కలిసి అడవి కుందేలును హతమార్చి తంగళ్లపల్లికి తీసుకువచ్చినట్లు అధికారుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.దీంతో నలుగురిని అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు కేసు నమోదు చేసి, తదుపరి విచారణ నిమిత్తం బెల్లంపల్లి రేంజ్ కార్యాలయానికి తరలించారు.

## నూతన పింఛన్లకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది కాబట్టి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలి అని సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒంటరి మహిళలు,వితంతువులు,గీత,చేనేత కార్మికులు , పైలేరియా,బోదకాలు ,డయాలసిస్ బాధితులు దివ్యాంగుల కేటగిరిలో థాలసీమియా,సికిల్ సెల్ ,హిమోఫిలియా బాదితులకు పింఛన్లు మంజూరు చేయాలని ఆదేశించింది అన్నారు.ఈ నెల 15 నుంచి కొత్త పింఛన్ల మంజూరు ఏర్పాట్లు చేయడం జరిగింది అని పెన్షన్లకు ఒక లక్ష యాభై వేలు పట్టణాల్లో రెండు లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం ఉన్నవారు అర్హులు. ఏడున్నర ఎకరాల కంటే ఎక్కువ మెట్ట పొలం ఉన్నవారు అనర్హులు. ప్రభుత్వ రంగ, ప్రైవేటు,ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు డాక్టర్లు ,కాంట్రాక్టర్లు, వృత్తి నిపుణులు ఆయిల్ మరియు రైస్ మిల్లులు ,పెట్రోల్ పంపులు ,రిగ్ యజమానులు వారి తల్లిదండ్రులు అనర్హులు . ఇప్పటికే ప్రభుత్వం లేదా స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ పొందుతున్న వారు నాలుగు చక్రాల వాహనాలు లేదా భారీ వాహనాలు ఉన్నవారిని అనర్హులుగా పరిగణిస్తారు.అని సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అన్నారు.గతంలో దరఖాస్తు చేసి ఉన్నవారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని అయితే తమరు దరఖాస్తులు ఉన్నాయో లేదో పంచాయతీ కార్యదర్శిలు వార్డు అధికారుల ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు. కొత్తవారు దరఖాస్తు చేయుట వెబ్సైట్ నుంచి దరఖాస్తు ఫారం డౌన్లోడ్ చేసుకోవాలి అని దానిని నింపిన తర్వాత గ్రామంలోని పంచాయతీ కార్యదర్శి కి ఆ దజేయాలని సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## పుట్టిన ప్రతి బిడ్డకు ముర్రుపాలు పట్టించడం శ్రేయస్కరం

సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ

చిలుకూరి మహేందర్ రెడ్డి

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా



పుట్టిన ప్రతి చంటి బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ఎంతో శ్రేయస్కరమని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో నిర్వహించిన 'తల్లిపాల వారోత్సవాల' కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుకునూరి కృష్ణతో కలిసి ఆయన పాల్గొన్నారు.?ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఎదిగే క్రమంలో తొలి పాలు ముర్రుపాలు పట్టించడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి ఇమ్యూనిటీ గణనీయంగా బలపడుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన శ్రీమంతం, అక్షరాభ్యాసం కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు.?ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుజాత, ఆశా వర్కర్ పద్మావతితో పాటు గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# అంగవైకల్యాన్ని జయించి.. ఆశయాల బాటలో అడుగులు

**విద్యుత్ ప్రమాదంలో చేయి, కాలు కోల్పోయినా ఆత్మవిశ్వాసం కోల్పోని అనిల్‌కుమార్..**
**కష్టాలను అధిగమిస్తూ చదువులో రాణింపు..**
**కళల్లోనూ ప్రతిభ.. నేటి యువతకు స్ఫూర్తిదాయక ప్రయాణం**

**అగ్నిధార న్యూస్,(కౌటాల):**

కష్టాలు ఎదురైనప్పుడు కుంగిపోవడం సులువు.. వాటిని ఎదురించి ముందుకు సాగడం అసలైన విజయం. శారీరక వైకల్యం జీవితానికి అడ్డంకి కాదని, ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఎలాంటి పరిస్థితినైనా అధిగమించవచ్చని నిరూపిస్తున్నారు కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కోసన్‌కార్ అనిల్‌కుమార్. తొమ్మిదేళ్ల ప్రాయంలో విద్యుత్ ప్రమాదానికి గురై కుడిచేయి, కుడికాలు కోల్పోయినా.. జీవితంపై ఆశను మాత్రం కోల్పోలేదు. కుటుంబ సభ్యుల అండ, గురువుల ప్రోత్సాహం, స్నేహితుల సహకారంతో చదువును కొనసాగించి ఉన్నత విద్యను అభ్యసించారు. పాటలు పాడటం, రచనలు చేయడం, సామాజిక సేవ వంటి రంగాల్లోనూ తన ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారు.

### పేద కుటుంబంలో పుట్టి.. చిన్ననాటే పెనువిషాదం

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల ఏజెన్సీ గ్రామమైన మొగడ్‌ధగడ్‌లో కోసన్‌కార్ దామాజీ, లక్ష్మి దంపతులకు 1988 సెప్టెంబర్ 6న అనిల్‌కుమార్ జన్మించారు. నలుగురు అక్కల తర్వాత జన్మించిన కుమారుడితో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. తండ్రి దామాజీ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. అటవీ ప్రాంతంలో ప్రభుత్వం అమలు చేసిన వన సంరక్షణ సమితి (ఉూూ) కార్యక్రమంలోనూ ఆయన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.అయితే ఆ కుటుంబం ఎదుగుదలను ఓర్వలేని కొందరి కక్ష, ఈర్ష్య చివరకు విషాదానికి దారితీసింది.

### విద్యుత్ రూపంలో ముంచెత్తిన విషాదం

అనిల్‌కుమార్ ఐదో తరగతి చదువుతున్న రోజులు. ఓ శుక్రవారం ఉదయం తల్లి చేతి గోరుముద్దలు తిని ఆడుకునేందుకు వెళ్లిన బాలుడి జీవితాన్ని ఊహించని విద్యుత్ ప్రమాదం ఒక్కసారిగా మార్చేసింది.కుటుంబం కౌలుకు తీసుకున్న వ్యవసాయ భూమిలో విద్యుత్ లైన్ కలిపి ఉండటాన్ని గమనించని అనిల్‌కుమార్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయన కోమాలోకి వెళ్లారు. తొలుత సిర్పూర్ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు.. మెరుగైన వైద్యం కోసం మహారాష్ట్రలోని వర్ధా సేవాగ్రామ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.దాదాపు రెండు నెలల పాటు కోమాలో ఉన్న అనిల్‌కుమార్ చివరకు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే అప్పటికే ఆయన కుడిచేయి, కుడికాలు తీవ్రంగా దెబ్బతినడంతో వైద్యులు వాటిని తొలగించాల్సి వచ్చింది. సుమారు ఏడు నెలల పాటు ఆసుపత్రి మంచానికే



పరిమితమయ్యారు.ఆసుపత్రి ఖర్చుల కోసం తల్లిదండ్రులు పడిన ఆర్థిక ఇబ్బందులు.. బంధువుల వద్ద చేసిన అప్పులు.. ఆసుపత్రి సిబ్బంది అందించిన మానవీయ సహాయం.. ఇవన్నీ అనిల్‌కుమార్ జీవితంలో చెరగని జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

### భుజాలపై బడికి.. కలెక్టర్ కరుణతో ట్రైసైకిల్

ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కనీస అవసరాలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినప్పటికీ అనిల్‌కుమార్ చదువును మాత్రం వదులుకోలేదు. ట్రైసైకిల్ సౌకర్యం లేకపోవడంతో తండ్రి, అక్కలు ఆయనను తమ భుజాలపై మోసుకుంటూ ప్రతిరోజూ పాఠశాలకు తీసుకెళ్లేవారు. ఇలా సుమారు రెండేళ్లపాటు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఏడో తరగతి పూర్తి చేశారు. తర్వాత అప్పటి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ వికాస్‌రాజ్‌ను కలవగా.. ఆయన పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే ట్రైసైకిల్ మంజూరు చేశారు. ఆ సహాయం అనిల్‌కుమార్ విద్యాభ్యాసానికి కొత్త ఊపిరినిచ్చింది. 8వ తరగతి నుంచి స్వయంగా పాఠశాలకు వెళ్లే అవకాశం లభించింది. గురువుల ప్రోత్సాహం, స్నేహితుల సహకారంతో పట్టుదలగా చదివి 2004 మార్చిలో పదో తరగతిని విజయవంతంగా పూర్తి చేశారు.

### ఉన్నత విద్య.. కళల్లోనూ ప్రతిభ

అనిల్‌కుమార్ విద్యాభ్యాసం అక్కడితో ఆగలేదు. కౌటాలలో ఇంటర్మీడియట్, కాగజ్‌నగర్‌లో డిగ్రీ, మంచిర్యాలలో పీజీ విద్యను పూర్తి చేశారు.చదువుకునే సమయంలో ఆర్థిక ఇబ్బందులు వెంటాడినా.. ఒంటరిగా ఎన్నో సవాళ్లు ఎదురైనా ఆయన వెనుకడుగు వేయలేదు. చదువుతో పాటు తనలోని కళా ప్రతిభను వెలికితీశారు.దౌలత్ సార్ వంటి గురువుల ప్రోత్సాహంతో పాటలు రాయడం, పాడటం, వ్యాస రచనలో నైపుణ్యం సాధించారు. కళాశాల స్థాయిలో పలు పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతులు సైతం అందుకున్నారు.

సమాజ సేవపై ఉన్న ఆసక్తితో యువతరం స్వచ్ఛంద సేవా సంస్థతో కలిసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వి6 లైఫ్



మీడియా ఛానెల్‌లో పాటలు పాడి తనలోని కళాకారుడిని ప్రేక్షకులకు పరిచయం చేశారు.

### ఉద్యోగం కోసం ఎదురుచూపులు.. అయినా ఆత్మవిశ్వాసమే ఆయుధం

ఉన్నత విద్యను పూర్తి చేసినప్పటికీ అనిల్‌కుమార్‌కు ఇప్పటికీ సరైన ఉద్యోగం లభించకపోవడం బాధాకరమైన విషయం. శారీరక వైకల్యాన్ని కారణంగా చూపుతూ కొందరు చిన్నచూపు చూడటం, హేళన చేయడం ఆయనను బాధిస్తుంటాయి.కొన్ని సందర్భాల్లో జీవితంపై విరక్తి కలిగే పరిస్థితులు ఎదురైనా.. తనను నమ్ముకున్న స్నేహితులు, కుటుంబ సభ్యులు, సమాజానికి తన వంతు సేవ చేయాలన్న తపన ఆయనను తిరిగి నిలబెడుతున్నాయి.

### వైకల్యం శరీరానికే.. సంకల్పానికి కాదు!

తొమ్మిదేళ్ల వయసులోనే జీవితాన్ని పూర్తిగా మార్చేసిన విద్యుత్ ప్రమాదం.. కుడిచేయి, కుడికాలు కోల్పోవడం.. ఆర్థిక కష్టాలు.. విద్యాభ్యాసంలో ఎదురైన అవరోధాలు.. సమాజం నుంచి ఎదురైన చిన్నచూపు.. ఇవేవీ అనిల్‌కుమార్ సంకల్పాన్ని దెబ్బతీయలేకపోయాయి."అంగవైకల్యం శరీరానికే కానీ.. మనసుకు, సంకల్పానికి కాదు" అనే సందేశాన్ని తన జీవితంతోనే చాటుతున్న అనిల్‌కుమార్ ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.కష్టాలను చూసి వెనుదిరిగేవారికి ఆయన జీవితం ఓ గుణపాఠం. పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా.. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిరూపిస్తున్న ఈ యువకుడికి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉంది.

## అంతాయిగూడలో కళాకారుల ఆటపాటలతో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండలం అంతాయిగూడ గ్రామంలో విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణ పరిసరాల పరిశుభ్రతపై సర్పంచ్ హేమ బాలమ్మ (సురేష్ ) ఆధ్వర్యంలో శనివారం సాంస్కృతిక కళాకారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు తమ ఆటపాటలు, నాటికల ద్వారా పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు.?ఈ సందర్భంగా సర్పంచ్ హేమ బాలమ్మ ( సురేష్) మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే డెంగ్యూ, మలేరియా, విష జ్వరాల పట్ల గ్రామ ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.?పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, ఇంటి చుట్టుపక్కల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి.?నీరు నిల్వ ఉండకుండా చూడడం,పాత టైర్లు, కొబ్బరి బొబ్బలు, పూల కుండీలు, ఎయిర్ కూలర్లలో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయి కాబట్టి ఎప్పటికప్పుడు ఆ నీటిని పారబోయాలి.?వ్యక్తిగత జాగ్రత్తలు రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగానని సూచించారు.వైద్య సహాయం జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్లు బి. మహేందర్ జి నర్సిములు కృష్ణ కనకయ్య పంచాయతీ సెక్రటరీ స్వామి ఆశ వర్క్ ప్రియాంక గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

## దౌలాపూర్ లో భాగస్వామ్య గ్రామ అంచనా కార్యక్రమం

**అగ్ని ధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామలో ప్రాథమిక పాఠశాలలో ఆర్జీఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య అంచనా కార్యక్రమాన్ని రివ్యూ కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి సంబంధించిన వ్యవసాయం పంటల సాగు భూమి వినియోగం నేల రకాలు గ్రామంలో మౌలిక వసతులు కులాంగన వ్యవసాయ కార్యకలాపాలు గ్రామ సమస్యలు వంటి పరిష్కారం మార్గాలు వంటి అంశాలను విద్యార్థులు రంగవల్లులు చాట్లు వ్యూహాలు చెక్ డ్యాములు సీజనల్ క్యాండిల్ సమస్య పరిష్కారానికి పద్ధతులు ద్వారా ఆకర్షణీయంగా ప్రదర్శించబడ్డాయని క్రమంలో కోఆర్డినేటర్ సిహెచ్ పల్లవి వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ డీ అశ్విని గ్రామ సర్పంచ్ కుకునూరు కృష్ణ ఈవో క్రాంతికుమార్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత రాణి పాటల పాఠశాల సిబ్బంది గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు టీ పల్లవి కే శివాని బి సోను డి నందిని జి ప్రవళిక ఈ కార్యక్రమంలో ద్వారా వ్యవసాయ సమస్యలపై అవగాహన సంప్రదించడంలో పెంపొందించడంతోపాటు గ్రామ అభివృద్ధిలో రైతులు గ్రామ ప్రజలు భాగస్వామ్యం ఎంత ముఖ్యమో రైతులకు వివరించడం జరిగిందని తెలిపారు.

## ప్రపంచ ఆదివాసీ హక్కుల దినోత్సవం

**: ఆదివాసీల రక్షణకు ప్రతి ఒక్కరూ కదలాలి -**
**పౌరహక్కుల సంఘం పిలుపు**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

"ఆదివాసీలను కాపాడుకోవడం అంటేనే ప్రకృతిని కాపాడుకోవడం" అని పౌరహక్కుల సంఘం (జూజ) ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ స్పష్టం చేసింది. ఆగస్టు 9 'ప్రపంచ ఆదివాసీల హక్కుల దినం' సందర్భంగా, ఆదివాసీల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరిని, వారి అడవులను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలను నిరసిస్తూ సీఎల్సీ కీలక ప్రకటన విడుదల చేసింది.

### పోరాట స్ఫూర్తిని స్మరిస్తూ..

బీర్సాముండా, అల్లూరి సీతారామరాజు, కొమరం భీం వంటి మహనీయుల పోరాట స్ఫూర్తితో ఆదివాసీలు ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత 1/70 చట్టం, 1996 పేసా, 2006 అటవీ హక్కుల చట్టాలను సాధించుకున్నారని సీఎల్సీ గుర్తుచేసింది. అయితే, దశాబ్దాలు గడుస్తున్నా ఈ చట్టాలు నేటికీ ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

### కార్పొరేట్ల వేటలో ఆదివాసీల ఉనికి ప్రమాదంలో..

2005 నుంచి ప్రభుత్వాలు ఆదివాసీల పట్ల శత్రుపూరితంగా వ్యవహరిస్తూ, కార్పొరేట్లకు మిత్రులుగా మారుతున్నాయని సీఎల్సీ తీవ్రంగా విమర్శించింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి వంటి ప్రాంతాల్లో గ్రామసభల తీర్మానాలకు వ్యతిరేకంగా మైనింగ్ విస్తరణకు వేల ఎకరాల అటవీ భూమిని లాయిడ్స్ మెటల్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థకు అప్పగించడం దీనికి నిదర్శనమని పేర్కొంది. అభివృద్ధి పేరుతో ఆదివాసీలను వారి పురిటిగడ్డ నుంచి వేరు చేసి, పట్నాల్లోకి నెట్టేస్తున్నారని, దీనివల్ల చెంచుల వంటి గిరిజన జాతులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపింది.

### ప్రజా సంఘాలు, మేధావులకు విజ్ఞప్తి:

ఈ నేపథ్యంలో, ఆదివాసీల సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక మరియు భూమి హక్కులను కాపాడుకోవడానికి సమాజంలోని అన్ని వర్గాలు ఏకం కావాలని సీఎల్సీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, బుద్ధిజీవులు, విద్యార్థి సంఘాల నాయకులు, మహిళలు మరియు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని, ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం సాగుతున్న ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు."అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేయడం కాకుండా, ప్రకృతితో మమేకమై జీవించే ఆదివాసీల జ్ఞానాన్ని గౌరవిద్దాం. వారి హక్కులను కాపాడుతూ, ఆదివాసీల రక్షణ కోసం గొంతు కలుపుదాం" అని సీఎల్సీ నాయకులు పిలుపునిచ్చారు.

## 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి



**బొగ్గు పరిశ్రమల్లో నాలుగు లేబర్ కోడ్‌ల అమలును నిలిపివేయాలి**
**10న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా జయప్రదం చేయండి**
**- జేఏసీ నాయకుల పిలుపు**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

దేశంలోని ప్రభుత్వ రంగ బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల జీతాలు, అలవెన్సుల పెంపు కోసం 12వ వేతన కమిటీని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బొగ్గు పరిశ్రమల్లో నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయవద్దని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10న సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకుడు గడ్డం కృష్ణ మాట్లాడారు. బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు జూలై 1 నుంచి 12వ వేతన కాలపరిమితి ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం వేతన కమిటీని ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు.గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏ సంఘానికీ 51 శాతం ఓట్లు రాకపోతే అధికారులే కమిషన్ ఏర్పాటు చేసి, తమకు అనుకూలంగా వేతనాల పెంపు చేపట్టే అవకాశం ఉందన్నారు. దీనివల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర బొగ్గు గని కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు తెలిపారు.

అందులో భాగంగా ఈ నెల 10న సింగరేణి పరిధిలోని అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గౌతం గోవర్ధన్, ఏఐటీయూసీ బ్రాంచి నాయకులు దాసరి శ్రీనివాస్, బిట్టి వెంకటేశ్వర్లు, ఏ.వీ.ఎస్. ప్రకాశ్, రాజేశ్వర్‌రావు, దేవయ్య, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్, సీఐటీయూ నాయకులు శివరాంరెడ్డి, రాజమౌళి, నరహరిరావు, ప్రవీణ్, ఐఎన్‌టీయూసీ నాయకులు వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గేదె అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

**తాండూర్:** తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రేచిని గ్రామానికి చెందిన గోగర్ల ప్రవీణ్ (26) మృతి చెందాడు.తాండూర్ ఎస్సై ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం ప్రవీణ్ తాండూర్ ఐబీ నుంచి మోటార్‌సైకిల్‌పై రేచిని గ్రామానికి వెళ్తుండగా ఎన్టీఆర్ కాలనీ దాటిన అనంతరం గేదె అడ్డుగా రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రవీణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్‌భరోను జయప్రదం చేయాలి




**పీవైఎల్ నాయకుల పిలుపు**

**అగ్ని ధార న్యూస్ ,(అంతర్గాం):**

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 10న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'జైల్‌భరో' కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) నాయకులు పిలుపునిచ్చారు.అంతర్గాం మండలం పెద్దంపేట్ గ్రామంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో శనివారం పీవైఎల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి అశోక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి యువతను మోసం చేసిందని ఆరోపించారు. ఉద్యోగాల కోసం న్యాయపోరాటం చేస్తున్న నిరుద్యోగ విద్యార్థి, యువతపై ఢిల్లీలో లాఠీచార్జి చేయడం దారుణమన్నారు.కేంద్ర ప్రభుత్వం స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువతతో పాటు చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలకు నష్టం కలిగించే విధానాల వల్ల దేశంలో పేదరికం, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

### కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ రంగం నుంచి వైదొలగాలి

1942లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 'క్విట్ ఇండియా' ఉద్యమం ద్వారా దేశాన్ని విడిచి వెళ్లాలని నాటి స్వాతంత్ర్య సమరయోధులు పోరాడారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో దేశ వ్యవసాయ రంగం నుంచి కార్పొరేట్ సంస్థలు వైదొలగాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను (ఎఫ్‌టీఏ) రద్దు చేయడంతో పాటు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'జైల్‌భరో' కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పీవైఎల్ నాయకులు దూలం సతీష్, ఈదునూరి బాబు, కోడిపుంజుల శ్రావణ్, బండి శ్రావణ్, బండి సతీష్, తూల్ల సతీష్, తమ్మనవేని సతీష్, తమ్మనవేని రమేష్, పొనగంటి క్రాంతికుమార్, ఈ. అంజీ, బోయపోతు ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## భవనంపై జారిపడి కార్మికుడు మృతి

**ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా పోచారం జోడిమెట్ల హరి హర కన్స్ట్రక్షన్ లో విషాదం జరిగింది మధ్యప్రదేశ్ కు చెందిన వినోద్ కుమార్( 37) భవన కార్మికుడు 15వ అంతస్తులో పెయింట్ వేస్తుండగా భవనం పైనుంచి ప్రమాదవశాత్తు శనివారం కిందపడి మృతి చెందాడు తోటి భవన కార్మికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోచారం ఐటీ కారిడాల్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు

## హనుమాన్ టెంపుల్‌లో నూతన రూమ్ నిర్మాణం..

**దాతలు ముందుకు రావాలని భక్తుల కోరిక..**

**జమ్మికుంట :** జమ్మికుంట పట్టణంలోని గణేష్ నగర్ హనుమాన్ టెంపుల్×లో భక్తుల సౌకర్యార్థం కొత్త రూమ్ నిర్మాణం చేపడుతున్నారు.

## శతచండీ యాగంతో ఇందూరు పావనం

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**

**ఇందూరు:** శత చండీయాగంతో ఇందూరు పావనమైందని, లోక కళ్యాణార్థం యాగం చేయడం అద్భుతమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన శత చండీయాగం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ యాగంతో ఎల్ నినో పరిస్థితులను అధిగమించి మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల యాగం ఫలితం మొదటి రోజే చూశామని సమృద్ధిగా వర్షం కురిసిందని గుర్తు చేశారు. రైతు బాగుంటే అందరూ బాగుంటారని, దేశం బాగుంటుందన్నారు. హిందూ ధర్మంలో మాత్రమే "సర్వే జన సుఖినో భవంతు" అని అంటారని, అందరికోసం వేడుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా యాగం నిర్వహణకు కృషి చేసిన అన్ని సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రొంపి కుంటలో చేనేత దినోత్సవం.

**కమాన్ పూర్ :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కమాన్‌పూర్ మండల పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కుందారపు బాపు నేత ఆధ్వర్యంలో "ఆత్మీయ సన్మాన కార్యక్రమం" శుక్రవారం రాత్రి రొంపికుంటలోని పద్మశాలి భవనంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పెద్దపెల్లి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు వేముల రామ్మూర్తి పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన ఇటీవల నూతనంగా ఎన్నికైన మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, రామగుండం కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి, శ్రీ ఆదివరాహ స్వామి దేవస్థానం డైరెక్టర్ కుందారపు శంకర్ లను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.

# ఆసుపత్రి పాలైన అవికా గోర్

## 104 డిగ్రీల జ్వరంలోనూ షూటింగ్ చేసిన 'చిన్నారి పెళ్లికూతురు'



టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన 'బాలికా వధు' (చిన్నారి పెళ్లికూతురు) ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం మరియు జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.




# కొరియన్ కనకరాజు'.. ఫస్ట్‌డే కలెక్షన్స్ ఎంతంటే..

చాలా రోజుల తర్వాత మెగాహీరో వరుణ్ తేజ్ డీసెంట్ హిట్ కొట్టాడు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. నిన్న(ఆగస్ట్ 7) ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి..తొలి రోజు మిశ్రమ స్పందన లభించింది. కథగా చూస్తే ఈ హారర్ కామెడీ రొటీన్ అయినప్పటికీ.. కామెడీ సీన్లు వర్కౌట్ అయ్యాయని పలు వెబ్‌సైట్లు తమ రివ్యూల్లో పేర్కొన్నాయి. అయితే టాక్‌తో సంబంధం లేకుండా తొలి రోజు ఈ చిత్రం భారీ వసూళ్లనే సాధించింది. మొదటి రోజు ప్రపంచ వ్యాప్తంగా రూ. 10.20 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ మధ్యకాలంలో వరుణ్ నటించిన చిత్రాలేవి ఫస్ట్‌డే ఈ స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేదనే చెప్పాలి. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రితికా నాయర్ హీరోయిన్‌గా నటించింది. సత్య, సునీల్ ఇతర కీలక పాత్రలు పోషించారు. తమన్ సంగీతం అందించాడు.

# రవితేజ 'ఇరుముడి' ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్..

## భీమవరంలో గ్రాండ్‌గా రిలీజ్!




మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పటివరకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమాపై బజ్ క్రియేట్ చేసిన మేకర్స్.. ఇప్పుడు అతిపెద్ద ప్రమోషనల్ అప్‌డేట్‌కు సిద్ధమయ్యారు. అదే 'ఇరుముడి' థియేట్రికల్ ట్రైలర్. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 12న 'ఇరుముడి' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. రిలీజ్‌కు కేవలం కొద్ది రోజుల ముందు ఆగస్టు 12న ట్రైలర్‌ను విడుదల చేయడం ద్వారా ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# నాని--సుజీత్ 'బ్లడీ రోమియో'లో హీరోయిన్‌గా లెనిన్ బ్యూటీ



**మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్?**

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే సెన్సేషనల్ డైరెక్టర్ సుజీత్‌తో కలిసి ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటించనున్నారు. ఇప్పటికే 'ఓజీ'తో తన మార్క్ చూపించిన సుజీత్ దర్శకత్వంలో నాని హీరోగా నటిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు 'బ్లడీ రోమియో' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం అక్టోబర్ నుంచి షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించనుంది. ఇప్పటివరకు ఈ సినిమాలో నాని సరసన ఎవరు హీరోయిన్‌గా నటించనున్నారనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం యంగ్ అండ్ గ్లామరస్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేను ఈ ప్రాజెక్ట్ కోసం సంప్రదించినట్లు తెలుస్తోంది. దర్శకుడు సుజీత్, నిర్మాతలు ఇప్పటికే భాగ్యశ్రీతో చర్చలు జరిపినట్లు, కథతో పాటు తన పాత్ర నచ్చడంతో ఆమె కూడా ఈ సినిమాకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు ఫిలింనగర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చిన భాగ్యశ్రీ బోర్సే.. మాస్ మహారాజా రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే తన స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకున్న ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ నటించిన 'కింగ్డమ్', రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలుకా' వంటి చిత్రాల్లో నటించి తన పరిధిని పెంచుకున్నారు. ఇక అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన 'లెనిన్' సినిమాతో భాగ్యశ్రీ బోర్సేకు మరింత క్రేజ్ వచ్చింది. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పాటు, సినిమా విజయం ఆమెకు వరుస అవకాశాలు తెచ్చిపెడుతోంది. ఒకవైపు వరుస విజయాలతో నాని మంచి ఫామ్‌లో ఉండగా.. మరోవైపు 'ఓజీ'తో సుజీత్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ ఇద్దరి కలయికలో 'బ్లడీ రోమియో' తెరకెక్కనుండటంతో సినిమాపై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారన్న వార్త నిజమైతే నాని--భాగ్యశ్రీ జోడీకి ఇదొక కొత్త కాంబినేషన్ కానుంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com